




రాజమహేంద్రవరంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఆదివారం కన్నులపండువగా సాగింది.

5

సెంటు.. మంట!

వైసీపీ హయాంలో 'గాలి' పట్టాలు



ఎందుకీ భూమి : దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఊరికి 2 కి.మీ దూరంలో జగనన్న ఇళ్ల కాలనీ కోసం సేకరించిన నివాసయోగ్యం కాని స్థలం.. ఇక్కడ కనీసం ఒక పునాది పడలేదు.

- జగనన్న కాలనీల పేరిట భారీ అవినీతి
- పనికిరాని భూముల్లోనే లేఅవుట్లు
- స్థలాలు ఇచ్చినా లబ్ధిదారుల విముఖత
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- రాజమహేంద్రిలో ఆవ భూములు
- 20 వేల పట్టాలిచ్చినట్టు రికార్డులు
- 50 వేల దరఖాస్తులు పెండింగ్
- స్థలాలు ఇవ్వాలని డిమాండ్
- కూటమి నేతలకు ప్రజల వేడుకోలు



మా స్థలం చూపండి సార్ : రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు పట్టాలిచ్చి స్థలాలు చూపాలని అడుగుతున్న లబ్ధిదారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పేదోడిని గూడు గోడు వేధిస్తోంది. సొంతింటి కల 'కల'గానే మిగిలిపోతోంది. పేదోడికి సెంటు జాగా కరువైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ రేపు ఇస్తాం.. మాపు ఇస్తాం గడిపేశారు. చివరికి కోరుకొండ మండలం బూరుగుపూడి ఆవ భూముల్లో స్థలాలు కేటాయించి చేతులు దులుపుకున్నారు.. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ఎన్నికల ముంగిట హడావుడి చేశారు. పట్టాలు పంపిణీ చేసి ప్రజలను మోసం చేశారు. ఓటు రాజకీయం చేసి ప్రజల మనోభావాలతో ఆటలాడుకున్నారు. వేలాదిగా వచ్చిన దరఖాస్తులను గృహ నిర్మాణ కార్యాలయంలో మగ్గబెట్టారు. చివరికి కేంద్ర ప్రభుత్వం కేటాయించినా వాటిలో నాలుగో వంతు పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో జనం ఎదురుచూస్తున్నారు. తాము పెట్టుకున్న దరఖాస్తులకు గ్రహణం వీడుతుందనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో గృహాలివ్వండి సారూ..

2019కి ముందు టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున టిడ్కో గృహాలు నిర్మించారు. సుమారు 80 శాతం నిర్మాణం పూర్తయిన తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయినా టిడ్కో గృహాలు మాత్రం కేటాయించలేదు.. ఐదేళ్లు ఊరించి ఉసూరుమనిపించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీ కట్టలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.అయినా గత వైసీపీ పాలకులకు ఏం పట్టలేదు.టీడీపీపై ఉన్న రాజకీయ కక్షతో పేదలను ఇబ్బందులకు గురి చేశారు.బ్యాంకులోన్లు కట్టలేక.. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారు.ఆ ఐదేళ్లూ ఇంటి అద్దె కట్టలేక సతమతమయ్యారు. ఐదేళ్లూ తాము పడ్డ కష్టానికి వైసీపీ నాయకులను బాధ్యులను చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా టిడ్కో గృహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పేదల స్థలాల పేరిట మేత..

వైసీపీ ప్రభుత్వంలో పేదల స్థలాల పేరిట బాగా అవినీతికి పాల్పడ్డారు. పేదల పేరిట పనికిరాని ముంపు భూములను పది రెట్లు ఎక్కువ రేటుకు కొనుగోలు చేసి భారీగా సొమ్ములను జేబులో వేసుకున్నారు. పైగా వాటిని చదును చేస్తున్నామంటూ మట్టిలోనూ మెక్కేశారు. చిన్న రికి చినుకు పడితే ఆ స్థలాలు వరద గోదావరిని తలపించేవి. రాజమహేంద్రవరం నియోజకవర్గంలో అయితే మరీ దారుణం. ఏకంగా కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆవ భూమిని కొనుగోలు చేసి సెంటు చొప్పున పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఆ భూమిని ఇంటి నిర్మాణానికి ఆమోదయోగ్యంగా ఉండదు. చినుకు పడిందంటే చెరువైపోతోంది.మామూలుగా ఆ ఆవ భూమి రెండు తాడిచెట్ల లోతు నీటితో నిండి ఉంటుందని స్థానికుల సమాచారం. దీనిపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జిల్లాలో జగనన్న కాలనీలు ఆరంభించని నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరమే. సెంటు జాగా కోసం వైసీపీ నేతలు జనాలను వేధించుకుతిన్నారు. వైసీపీ హయాంలో ప్రజలు గూడుకు ఇచ్చిన దరఖాస్తులు వేలాదిగా గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో పేరుకుపోయాయి.అదిగో స్థలం.. ఇదిగో ఇల్లు అంటూ దరఖాస్తులను మగ్గబెట్టారు.కూటమి ప్రభుత్వంలో వాటికి మోక్షం కలుగుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పనికిరాని భూములే స్థలాలుగా..

జిల్లాలోని వైసీపీ నేతలు ప్రజలు కళ్ల ముందే కనికట్టు చేశారు. ఎందుకూ పనికిరాని భూములను కొనుగోలు చేసి స్థలాల కింద కేటాయించారు. జిల్లాలోని తాళ్లపూడి మండలం సూరాయిపేట, బల్లిపాడులో స్థలాలు కేటాయించడంతో పెద్ద వివాదమే నడిచింది. ఆయా స్థలాల లబ్ధిదారులు ఏకంగా గత కలెక్టర్ మాధవీలతను నిలదీశారు. నివాసయోగ్యం కాని భూములు మాకొద్దంటూ నిరసన తెలిపారు. బల్లిపాడు లబ్ధిదారులకు తిరుగుడు మెట్టలో స్థలాలు కేటాయించినా అక్కడా అదే పరిస్థితి. ఏ ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోలేదు.దేవరపల్లి మండలం కృష్ణపాలెం,దుమంతునిగూడెం గ్రామస్తులకు కృష్ణపాలెం పరిధిలో ఉన్న పోలవరం కాల్వ గట్టు పక్కన సుమారు 275 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ స్థలాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతాయి.దీంతో ఆ స్థలాలు మాకొద్దంటూ లబ్ధిదారులు జాతీయ రహదారిపైనే బైఠాయించి నిరసన తెలిపారు. గత కలెక్టర్ మాధవీలత వచ్చి పరిశీలించి ఎటూ తేల్చకుండా వదిలేశారు. యర్నగూడెంలో ఊరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు విముఖత వ్యక్తం చేశారు.ఆ స్థలాలు మాకొద్దు మార్చాలని డిమాండ్ చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ఇక రాజమహేంద్రవరం రూరల్ మండలం వేమగిరిలోనూ పనికిరాని స్థలాలను పేదలకు ఇచ్చారు. వేమగిరి కొండదిగువన స్థలాలు కేటాయించినట్టు సమాచారం. దీనిపై గతంలో కడియం మండల కార్యాలయాన్ని మహిళలు పెద్ద ఎత్తున ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని నాటి కలెక్టర్ మాధవీలత హామీ ఇచ్చారు. నేటికీ ఆ హామీ అలాగే మిగిలి ఉంది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏకంగా ఆవ భూములనే స్థలాలుగా కేటాయించారు. బూరుగుపూడి వద్ద నివాస యోగ్యం కాని సుమారు 600 ఎకరాల ఆవ భూమిని ఎంపిక చేశారు. అప్పటి కలెక్టర్ కూడా వైసీపీ నాయకులకు తన వంతు సహకారాన్ని అందించారు. ఇదే అదనుగా వందల కోట్ల రూపాయలు నొక్కుడుకు తెర తీశారు. ఎకరం ఏడు లక్షలు కూడా చేయని భూములను ఏకంగా రూ.45 లక్షలు పెట్టి కొనడానికి ప్లాన్ వేశారు. ఆ సొమ్ములు భూమి ధర రైతుకు ఇచ్చేసి మిగతా సొమ్మును భారీగా దోపిడీ చేయాలనుకున్నారు. ఈ తంతంగంలో సుమారు రూ.500 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. భూమిని చదును చేయడానికి కూడా కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ వ్యవహారం వైసీపీలోని ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధుల మధ్య గొడవకు దారితీసినట్టు సమాచారం.ఈ భూముల్లో పట్టాలంటూ వేలాది మందికి పత్రాలను పంచి పెట్టారు.కానీ ఇప్పటికీ అక్కడ జనం నివసించడానికి సాహసించడం లేదు.అయితే స్థానిక రైతులు భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ప్రజల ఇళ్ల పేరిట అప్పటి ప్రభుత్వం ఖర్చు పెట్టిన కోట్లాది రూపాయలు ఎవరి గల్లా పెట్టెలోకి వెళ్లాయో సీబీసీఐడీతో వెలికి తీయించాలనే డిమాండ్లు బలంగా వినవస్తున్నాయి. ఈ దోపిడీపై మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు అప్పట్లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇక ఎన్నిక షెడ్యూల్‌కి వారం ముందు నుంచీ మాజీ ఎంపీ భరత్ రామ్ కొత్త సినిమాకు తెరతీశారు. కాగితంపై స్థలాలను చూపిస్తూ కనికట్టు చేద్దామనుకున్నారు. అసలు భూమి లేకుండా 25 వేల పట్టాల పంపిణీ అంటూ హడావుడి మొదలు పెట్టారు.వారం పాటు మునిసిపల్, సచివాలయ సిబ్బందికి నిద్రాహారాలు లేకుండా చేసి పట్టాలను తయారుచేయించారు. కానీ ఆ స్థలాలు ఎక్కడ ఉన్నాయో మాత్రం చూపించలేక పోయారు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతంపేటకు చెందిన ఒక లబ్ధిదారురాలు తన స్థలం చూపించాలని ఎంత మొత్తుకున్నా సచివాలయ సిబ్బంది మాత్రం సాహసం చేయలేకపోయారు.మాజీ ఎంపీ హడావుడిగా పప్పుబెల్లం మాదిరిగా ఇచ్చేసిన పట్టాలకు సంబంధించిన స్థలాలను తమకు చూపించాలని.. లేకపోతే బహిరంగంగా క్షమాపణచెప్పాలని పెద్ద సంఖ్యలో డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సారూ.. మా స్థలం ఎక్కడ?

గత వైసీపీ ప్రభుత్వం ఓట్ల కోసం చెప్పిన అబద్ధాలకు ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఐదేళ్లలో రాజమహేంద్రవరంలో 20 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఇంకా 50 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే సిటీ నియోజకవర్గ పరిధిలో పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించకపోవడం గమనార్హం. దీంతో ప్రస్తుత కూటమి ప్రజాప్రతినిధులు సమస్యలు తెలుసుకోడానికి ప్రజల వద్దకు వెళుతుంటే వారు వైసీపీ ఇచ్చిన మోళీ పట్టాలతో స్వాగతం పలుకుతున్నారు. తమ స్థలాలు చూపించాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో వారిని సముదాయించడం టీడీపీ నేతలకు పెద్ద పనిగా మారిపోయింది. అసలు స్థలాలే లేకుండా పట్టాలు చేతిలో పెట్టి మోసం చేశారని వివరిస్తుంటే పాపం ఆ పేదలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇక కాలనీలు అంటూ మొదలు పెట్టి అతీగతీ లేకుండా వదిలేసిన ఇళ్ల మాటేమిటని ప్రశ్నిస్తున్న లబ్ధిదారులూ ఉన్నారు. వాళ్లనూ తాము ఆదుకుంటామని టీడీపీ నేతలు హామీ ఇస్తున్నారు. గతంలో తమ హయాంలో జరిగిన ఇళ్ల పంపిణీ మాదిరిగానే పారదర్శకంగా సొంత ఇంటి కల నెరవేరుస్తామని చెబుతున్నారు. ఇప్పుడు నిజంగా టీడీపీ ప్రజా ప్రతినిధులపై ఉన్న పెద్ద బాధ్యత కూడా ఇదే. ప్రభుత్వ కార్యాలయాల్లో మగ్గిపోతున్న దరఖాస్తుల దుమ్ము దులిపి తగు విచారణ చేయించి ఇంటి సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో దగా పడిన పేదోడి గూడుకు రూపం ఇవ్వాల్సిన నైతికత కూడా ఈ పాలకులపైనే ఉంది.

స్థలాల అవినీతిపై సీబీసీఐడీ విచారణ..

గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల్లో భారీ మోసమే జరిగింది.. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో అయితే స్థలాలు చూపకుండానే పట్టాలిచ్చేశారు. ముందు పనికిరాని ఆవ భూములను కొనుగోలు చేసి ప్రజలను మభ్యపెట్టారు. ఇది చాలా దారుణం. దీనిపై సీబీసీఐడీ విచారణ జరిపించాలి. ఈ మేరకు సీఎంకు విన్నవిస్తా. పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వం.. అందరికీ నివాసయోగ్యమైన స్థలాలు ఇస్తాం.

ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమహేంద్రవరం సిటీ



కొవ్వూరు ర్యాంపులో ఇసుక గుట్టలు పరిశీలిస్తున్న అధికారులు

మిగిలిన ఇసుకెంత

- నేటి నుంచి ఉచిత ఇసుక విధానం
- స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ అధికారుల పంపిణీ
- కుమారదేవం పాయింట్ నుంచి సరఫరా

రాజమహేంద్రవరం- (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు/పెరవలి, జూలై 7 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్న సంగతి తెలిసిందే.దీని కోసం జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేశారు.రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇది అమలు కానుంది. ఒక్కో స్టాక్ పాయింట్ వద్ద ఒక ఆర్ఐ, ఐదుగురు వీఆర్వోలను నియమించారు. ఇసుక టన్నుకు సుమారు రూ.200 పైగా ఉండవచ్చని చెబుతున్నారు. ఈ ధరలు ఇంకా ఖరారు కాలేదు. ర్యాంపుల నుంచి స్టాక్ పాయింట్ల వరకూ దూరాన్ని బట్టి, ఆయా స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ధర ఉంటుంది. జిల్లాలోని కాతేరు, లాలాచెరువు, బుర్రిలంక, కుమారదేవం-చిడిపి, పందలపర్రు, పెండ్యాల, ఉసులుమర్రులోని ఏడు స్టాక్ పాయింట్లలో 3 లక్షల టన్నుల ఇసుక ఉంది. దానినే ముందు విక్రయిస్తారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఇదిలా ఉండగా ర్యాంపుల్లో ఇసుక నిల్వలపై మైన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం ఆరా తీశారు. పెరవలి మండలం తీపర్రు, కొవ్వూరు, వాడపల్లి, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపుల్లో ఇసుక నిల్వలను మైన్స్ ఏజీ విఘ్నేష్, కొవ్వూరు తహశీల్దార్ కె. మస్తాన్‌లు సిబ్బందితో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభిస్తున్నందున అధికారులు ర్యాంపుల్లో నిల్వ ఉన్న ఇసుక ఎంత మేర ఉందో పరిశీలించి నిల్వ ఉన్న ఇసుక గుట్టలను నమోదు చేసుకున్నారు.కొవ్వూరు మండలం కుమారదేవం స్టాక్ పాయింట్ నుంచి సోమవారం ఉచిత ఇసుక రవాణా ప్రారంభిస్తారన్నారు. తీపర్రు - ఉసులుమర్రు మధ్య గల ఇసుక గుట్టల నుంచి ఉచిత ఇసుక పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అధికారులు అక్కడకు వచ్చి పరిశీలించారు.పడవ యజయానులకు గతంలో ప్రభుత్వం టన్నుకు రూ. 200లు ఇచ్చేదని.. ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం పడవ యజమానులకు ఇచ్చే ధరను పెంపుదల చేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ర్యాంపుల్లో నిల్వ ఉన్న ఇసుకను ముందుగా విక్రయించాలని కోరగా స్టాక్ పాయింట్లు పూర్తయిన తరువాత పడవ ర్యాంపులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించి విధి విధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉందని సోమవారం ఉదయం కలెక్టర్ ఆదేశాలు మేరకు ఇసుక పంపిణీ చేస్తామని తెలిపారు.ర్యాంపులను మైన్స్ ఏజీ విఘ్నేష్, తహశీల్దార్ కె.మస్తాన్, డిప్యూటీ తహశీల్దార్లు అజయ్‌కుమార్, కనకదుర్గ, సర్వేయర్ గోపాలకృష్ణ, ఇసుక స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి సన్నిబాబు, ఎస్ఐ మూర్తి, తీపర్రు ఉసులుమర్రు వీఆర్‌వోలు సుబ్బారావు,రవి పరిశీలించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7 : జిల్లా వ్యాప్తంగా జూలై 8 సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో అధికారులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) అనేది సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ అని ఇది పౌరులు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేయడానికి అనుమతిస్తుందన్నారు. 1902 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కలెక్టరేట్‌లో, డివిజన్, మునిసిపల్,మండల స్థాయి ప్రధాన కార్యాలయాల్లో అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించాలన్నారు.



మంజీరాలో రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సిద్ధమైన వేదిక.. సభా ప్రాంగణంలో మోదీ పథకాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నేడు బీజేపీ సందడి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఏర్పాట్లు - 2250 మందికి ఆహ్వానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం కాషాయరంగు పులుముకుంది. ఎటు చూసినా బీజేపీ ఫ్లెక్సీలతో నిండిపోయింది.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నేపథ్యంలో సోమవారం సందడి నెలకొంది.రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీజేపీ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం తొలిసారిగా ఇక్కడ జరగనుంది. ఈ ఎన్నికల్లో ఊహించని విధంగా బీజేపీ ఫలితాలు సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు. ముగ్గురు ఎంపీలు గెలిచిన సంగతి తెలిసిందే.దాంతో పాటు తమ కూటమి ప్రధాన భాగస్వామ్య పార్టీ తెలుగుదేశం 134 సీట్లు , మరో భాగస్వామ్య పార్టీ జనసేన 21 స్థానాలు సాధించాయి. దీంతో అప్పటి అధికార వైసీపీని మట్టికరిపించి కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేసిన జోష్ పార్టీలో కనిపిస్తోంది.అంతే కాదు కేంద్రంలో కూడా మోదీ మూడోసారి ప్రధాని కావడం కూడా ఈ పార్టీకి మరింత ఉత్సాహన్ని కల్పిస్తోంది. ఇదిలా ఉండగా తొలిసారి బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంజీరాలో జరగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన సోమవారం ఉదయం సుమారు 10 గంటలకు సమావేశం జరగనుంది. గత ఐదేళ్లలో రాష్ట్రం విచ్ఛిన్నమైంది. అప్పులపాలైంది. అభివృద్ధి లేదు. అరాచకం తాండవమాడింది. రాష్ట్ర విభజన అంశాలు అనేకం సాధించుకోవాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టును కుదేలు చేసింది.రాజధాని అమరావతి నిర్మాణాన్ని అర్ధంతరంగా ఆపేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ రాష్ట్రం అభివృద్ధి కోసం ఇక్కడ ఏ ఏ అంశాలపై చర్చించనున్నదనేది ఆసక్తిగా మారింది. వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. పలు సందర్భాల్లో పురందేశ్వరి కూడా ఇదే చెప్పారు. దీనిపై తీవ్ర చర్చ జరగనుంది. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతిపై ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక రాష్ట్రంలో బీజేపీ బలపడే విధంగా కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.గతంలో ఎన్నడూ రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యేలు లేరు.ఈసారి ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ముగ్గురు గెలిచారు.క్రమంగా స్థానిక ఎన్నికలు వస్తాయి. నామినేటెడ్ పదవులు ఉంటాయి. పార్టీ ఎదుగుదల, గుర్తింపుపై చర్చించడంతో పాటు గతం కంటే ఆంధ్రలో పార్టీ మెరుగుపడేందుకు కొన్ని తీర్మానాలు చేసే అవకాశం ఉంది. ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా ఉంటుందని చెబుతున్నారు.సమావేశానికి కేంద్రమంత్రులు కె.మురుగన్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు అసెంబ్లీ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు హాజరవుతారు. మొత్తం 2,250 మందికి ఆహ్వానం పంపారు.ఇప్పటికే చాలా మంది నేతలు రాజమహేంద్రవరం చేరుకున్నారు.జిల్లాలోని నేతలు పలు బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లపై పురందేశ్వరి చర్చించారు.నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు.అతిథులకు రూమ్‌లు ఏర్పాటు ,సిటీ డెకొరే షన్,స్టేజ్ ఏర్పాటు, ఎయిర్‌పోర్ట్ వద్ద రైల్వే, బస్టాండ్ల వద్ద ప్రముఖులకు స్వాగతం పలకడానికి పలు కమిటీలు వేశారు.

దీవించమ్మా.. కోట సత్తెమ్మ



నిడదవోలు, జూలై 7 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయానికి ఆదివారం పలు జిల్లాల భక్తులు పోటెత్తారు. కోట సత్తెమ్మ దీవించమ్మా అంటూ వేడుకున్నారు. కోటసత్తెమ్మకు ఆలయ అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, దూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి క్షీర నివేదన,మహానివేదన చేశారు. భక్తులు ఉచిత దర్శనం,ప్రత్యేక దర్శనం ద్వారా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి రూ.1,79,636లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

జిల్లా ఆసుపత్రి సంగతేంటి!



- జిల్లా ఆసుపత్రికి ప్రజల ఎదురుచూపులు
- కొవ్వూరులో ఏర్పాటు చేస్తారని వాదన
- జీజీహెచ్‌లో అవినీతి రోగం.. రోగుల ఇక్కట్లు
- నేడు వైద్య శాఖ మంత్రి రాక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7 : జిల్లా విభజన జరిగింది.. మెడికల్ కళాశాల ఏర్పాటైంది.. అయితే జిల్లా ఆసుపత్రిపై మాత్రం నేటికీ మీమాంస నెలకొంది..గత వైసీపీ ప్రభుత్వం నేడు.. రేపు అంటూ నెట్టుకొచ్చేసింది. ఎటువంటి కదలిక లేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లా ఆసుపత్రి సంగతి తేల్చాలని జిల్లా వాసులు పట్టుబడుతున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో కొవ్వూరులో జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా వినిపిస్తోంది. జిల్లాల పునర్విభజన తర్వాత కొవ్వూరు, నిడదవోలు, తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి తదితర మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో కలవడంతో ఆయా మండలాల నుంచి మెరుగైన వైద్యం కోసం రోగులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో రాజమహేంద్రవరంలో జిల్లా ఆసుపత్రి ఉండేది. ఇప్పుడు జీజీహెచ్‌గా మారడంతో కొవ్వూరులో జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వినిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అనపర్తి లేదంటే కొవ్వూరులో జిల్లా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తారనే వాదనలు వినిపించాయి. కొవ్వూరులో సకల సౌకర్యాలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రికి తగినట్టుగా ఏర్పాట్లు ఉన్నాయి. మరో వైపు కొవ్వూరును ఆనుకుని ఉన్న జాతీయ రహదారి ఆసుపత్రి ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. జాతీయ రహదారి మీదనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి.అదే విధంగా ఆసుపత్రి ఆవరణ కూడా భారీగా ఉండడంతో దానికే ఓటేశారు. అంతే కాకుండా కొవ్వూరు జిల్లాకు మధ్యస్తంగా ఉంటుంది.అటు నిడదవోలు, గోపాలపురం, ఇటు రాజమహేంద్రవరం,రాజానగరం, అనపర్తి ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజానీకం ఎదురుచూస్తున్నారు.

జీజీహెచ్‌లో అవినీతి..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు అవినీతి అనే మొండిరోగం పట్టుకుంది. జీజీహెచ్‌లోని జలగలు ప్రతి పనికీ ఒకరేటు పెట్టి పీల్చేయడం నిత్యకృత్యంగా మారింది. ప్రభుత్వం అందించే ఉచిత వైద్యం ఇక్కడ పక్కా కమర్షియల్‌గా మారిపోవడం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది. క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, నర్సింగ్ ఇలా ఏ విభాగం టచ్ చేసినా డబ్బు ... డబ్బు అనే మాట వినిపిస్తోంది. మెరుగైన వైద్యసేవల మాట దేముడెరుగు వైద్య సిబ్బందికి ముడుపులు ఇచ్చుకోలేక సామాన్యులు నరకయాతన పడుతున్నారు. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండే పేదలు, సామాన్యులు వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఆసుపత్రిలోని కొందరు సిబ్బంది టెస్టులకు డబ్బుల కోసం జలగల్లా పట్టి పీడిస్తుండడంతో జీజీహెచ్ పరువు రోడ్డున పడుతోంది. ఆసుపత్రి ఉన్నతాధికారులకు ఈ విషయాలన్నీ స్పష్టంగా తెలిసినా అదిగో విచారణ వేశాం, నివేదిక వచ్చాక చూద్దాం అంటూ చేస్తున్న ప్రకటనలు విమర్శలకు దారితీస్తున్నాయి. కాలయాపన తప్ప తీసుకున్న చర్యలు లేకపోవడంతో అమ్మో పెద్దాసుపత్రికా.. అంటూ సామాన్య రోగులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ వంటి టెస్టులకు ప్రజానీకం డబ్బులకు డబ్బులు చెల్లిస్తూనే వైద్యం కోసం మూడు చెరువుల నీళ్లు తాగాల్సి వస్తోంది.

నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7 : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉదయం 7:40 గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా ఉదయం 8:50 గంటలకు అనపర్తి చేరుకుంటారు. అనపర్తిలో ఉదయం 9 గంటల నుంచి ఉదయం 9:40 గంటల మధ్య వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేస్తారు.ఉదయం 10:30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటల తర్వాత రోడ్డు మార్గం గుండా బయలుదేరి రాత్రి 9 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

ఎంఎస్‌వోలపై చర్యలేవి..

జీజీహెచ్‌లో ప్రధానంగా ఎంఎస్‌వో విభాగం అవినీతి ఆరోపణలతో భ్రష్టుపట్టి పోయింది. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఏ కారణం చేతనో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్ (ఎంఎస్‌వో)ను ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగించడం విస్మయానికి గురి చేస్తోంది. నర్సింగ్ విభాగంలోనూ పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆ విభాగం బాధ్యులుగా ఉన్న సిస్టర్ ఒకరు ఇటీవల తన కిందిస్థాయి నర్సింగ్ స్టాఫ్‌తో ఆఫీసు కోసం అంటూ ఏసీ, ప్రింటర్, ఫ్రిడ్జ్ కొనిపించినట్టు ఆరోపణలున్నాయి. ఐసీయూల్లో సిస్టర్లు విధులు సక్రమంగా నిర్వర్తించడలేదనే ఫిర్యాదులున్నాయి. ఐసీయూలో గత 15 రోజులుగా వైద్యం చేస్తున్నా తమ బంధువులు కోలుకోలేదని, మరింత మెరుగైన వైద్యం అందించాలని కోరితే ఐసీయూ సిస్టర్లు పేషెంట్ డిశ్చార్జి పెట్టారంటూ ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి ఒకరు కన్నీళ్లతో ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఓపీ రిజిస్ట్రేషన్లలోనూ సమస్యలున్నాయి. ఎంఎస్‌వోలు, నర్సింగ్, ఓపీ, మెడికల్ క్యాజువాలిటీ వంటి కీలకమైన విభాగాల్లో అవినీతి పెరగడంతో పేదలు, సామాన్యులు పెద్దాసుపత్రి అంటేనే బెంబేలెత్తిపోతున్నారు.

జగన్నాథ రథయాత్ర

రథయాత్రకు హాజరైన భక్తులు





సాంస్కృతిక కార్యక్రమం



రథాన్ని లాగుతున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



వీధుల్లో రథయాత్ర జరుగుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్రను మధ్యాహ్నం 3 గంటలకు జోనల్ సెక్రటరీ రేవతి రమణ్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, సత్యగోపీనాథ్‌దాస్ ఇస్కాన్ సేవలను కొనియాడారు. భక్తులతో పాటు పురందేశ్వరి, దుర్గేష్ జగన్నాథ రథాన్ని లాగారు. రథయాత్ర రామాలయం సెంటర్ నుంచి గోరక్షణపేట, ఆజాద్ చౌక్, జాంపేట చర్చి, వెజిటేబుల్ మార్కెట్, టీటీడీ కాలేజీ, డీలక్స్ సెంటర్ హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర గుడి నుంచి ఇస్కాన్ గుడి వరకు సాగింది. అనంతరం సత్సంగ్ ప్రవచనాలు, మహా మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సర్పవరం జంక్షన్, జూలై 7: జిల్లాలో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వలు పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. ఆదివారం కార్పొరేషన్ 2వ డివిజన్ బొందగుంటలో ఓ పాడుబడిన ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు అర్బన్ ఎంఎస్‌వో ఆనంద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 1.85 టన్నుల బియ్యం సీజ్ చేశారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన కందా నాగసత్యనారాయణ అనే వ్యక్తి ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి 2వ డివిజన్ బొందగుంటలో డోర్ నెంబర్ 70-17-42/1 పిల్లి సత్యవతికి చెందిన పాడుబడిన పెంకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచాడు. అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆ గదిలో ఉన్న బస్తాల్లో ఉన్న సుమారు 1.85 టన్నుల పోర్టిఫైడ్ కెర్నల్స్ పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. నిందితుడు నాగసత్యనారాయణపై కేసు రాసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎండీయూ వాహనం ద్వారా కాకినాడలో గల ఎంఎస్ఎల్ గొడౌన్‌కు తరలించినట్లు ఎంఎస్‌వో ఆనంద్ తెలిపారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ రాజు, కృష్ణానగర్ వార్డు సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పోకడలతో విద్యా వ్యవస్థకు దెబ్బ

అమలాపురం టౌన్, జూలై 7: గత ప్రభుత్వ పోకడలతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సాల్ట్ పథకం పేరుతో తీసుకువచ్చిన సర్క్యులర్ 172, జీవో నెం.117లతో ప్రభుత్వ విద్యా రంగానికి తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలపై ప్రస్తుత ప్రభుత్వం సమీక్ష జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం అమలాపురం ఎంప్లాయిస్ హోంలో పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలు బలహీనమవ్వడానికి కారణమయ్యాయన్నారు. బైజూస్, టోఫెల్, సీబీఎస్ఈ, ఐబీ అంటూ రకరకాలుగా విద్యార్థులపై గత ప్రభుత్వం ఎన్నో ప్రయోగాలు చేసి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా చేశారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం లేకపోవడం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి వెళ్లిపోవడానికి కారణమవుతోందని విమర్శించారు. పర్యవేక్షణ పేరుతో ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువు రాదని ప్రచారం చేసి ఈ దుస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 4,600కు పైగా 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను చేర్చుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. 6 నుంచి 10 వరకు ఉన్న పాఠశాలల్లో సమాంతరం మీడియానికి అనుమతి ఇవ్వాలన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు టీమ్‌గా ఏర్పడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రయత్నం చేయాలన్నారు. కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో ఒక పాఠశాల గతంలో 250 మంది విద్యార్థులతో కళకళలాడగా నేడు అదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే మిగిలారన్నారు. మరో రెండు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే ఉన్నారన్నారు. కడప, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లోనూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని,



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలల్లోనే ఉండి విద్యాబుద్ధులు నేర్పించి పాఠశాలలపై నమ్మకం కల్పించాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకోబోతున్నామన్నారు. జీవో నెం.117ను తక్షణం రద్దు చేయాలని, 1, 2 తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలని తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)తో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, జిల్లా కార్యదర్శులు బి.చంద్రకళ, జీవీ రమణ, వైవీటీ దుర్గాప్రసాద్, మురళీమోహన్, ఎం.ప్రదీప్‌కుమార్, వైవీఎస్ఎం బాలాజీ, పి.శ్రీనివాస్, పి.మురుగేశ్వరరావు, వి.రత్నం, టి.విజయకృష్ణ పాల్గొన్నారు.

4 ప్రైవేటు ట్రావెల్ బస్సులు సీజ్

రూ.11 లక్షల జరిమానా



బస్సులను సీజ్ చేసిన అధికారులు

రావులపాలెం, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి వచ్చే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను ఆపి తనిఖీ చేశారు. ఆల్ ఇండియా పర్మిట్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న నాలుగు బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. వాటికి రూ.11 లక్షలు జరిమానా విధించారు. అంతే కాకుండా హెవీ గూడ్స్ వెహికల్స్, ఓవర్‌లోడ్ ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రూ.లక్ష వరకు అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు వాహనాలకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండేలా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో ఆషాఢ వైభవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, జూలై 7: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పండితులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించడంతో వేలాది మంది భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం మట్టి గాజుల విశేష అలంకరణలో భక్తులను అమ్మవారు అనుగ్రహించారు. అమ్మవారి ప్రీతిప్రధానమైన ఆషాఢ మాస పర్వదినాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది వాహనాల్లో భక్తులు లోవకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, సుమారు 100కు పైబడి సిబ్బందితో జిల్లా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు, ఛైర్మన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గాజుల అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్‌లలో, వసతి గదుల్లో వంటవార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు అమ్మవారిని 40 వేలకు పైబడి భక్తులు దర్శించుకోగా ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.9.61 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆషాఢ మాస మొదటి ఆదివారం రూ.2 లక్షల ఆదాయం అధికంగా వచ్చినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

లోవ భక్తుల నిలువ దోపిడీ

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి వేలాదిగా తరలివస్తున్న భక్తులను ఆలయంలో వివిధ షాపుల పాటదారులు నిలువునా దోచుకుంటున్నారు. టోల్‌గేట్, చీరలు, కూల్‌డ్రింక్స్, కొబ్బరికాయలు ఇతర షాపుల్లో డబుల్ రేట్లు వసూలు చేస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. అధిక ధరల విక్రయాలపై ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మరిడమ్మ జాతరకు భక్తులు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు



పెద్దాపురం, జూలై 7: భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు మొదటి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం టెంట్లు నిర్మించారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక చాపల వీధి సంబరం ఎంతగానో ఆకట్టుకుంది. పలు రకాల దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, జూలై 7: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కాకినాడ సూర్యకళా మందిరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కాకినాడలోని పలు కూడళ్లను ఏఐఎస్ఎఫ్ జెండాలు, తోరణాల అలంకరిస్తున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు 26 జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అనేక పోరాటాలు సాగించి విజయాలు సాధించిందన్నారు. శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందుగా ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మానవహక్కుల ఉద్యమనేత, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని తెలిపారు.

హైకోర్టు జడ్జి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి

ఆత్రేయపురం, జూలై 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జున రావు దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం పూర్ణకుంభ స్వాగతం పలికింది. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జడ్జి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేడుకగా సత్యదేవుని రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 7: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షిణ చేయించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. అలాగే సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆరోగ్య ప్రదాత అయిన సూర్యభగవానుడికి విశేష పూజలు నిర్వహించి వివిధ ఆసనాలతో ప్రార్థించారు. అనంతరం క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

నేడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరగనుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రానున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుండడంతో ఆ పార్టీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆహ్వానితులకు గూగుల్ ఫార్మాట్‌లో అప్లికేషన్ ద్వారా సమ్మతి పంపించారు. అలాగే ఎంపీ పురందేశ్వరి ఆహ్వానితులను ఆడియో కాన్ఫరెన్స్‌లో ఆహ్వానించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

అరుదైన డెవిల్ ఫిష్



ఆలమూరు, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద ఆదివారం కాలువలో అరుదైన డెవిల్ ఫిష్ లభ్యమైంది. జాతీయ రహదారి చెంతన ఉన్న కోరంగి కాలువలో మత్స్యకారులు చేపల కోసం వల వేస్తే ఇది చిక్కింది. నల్లచారలతో ఆకర్షణీయంగా ఉండడంతో అక్కడి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ డెవిల్ ఫిష్ కాలువలు, గోదావరిలో పెరిగే సాధారణ చేపలను తినేస్తుందని, మిగిలిన చేప జాతికి ప్రమాదమని మత్స్యకారులు చెప్తున్నారు.

ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

40 వేల ప్యాకెట్ల అమ్మకం

అన్నవరం, జూలై 7: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో తొలి ఆదివారం తలుపులమ్మ లోవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు జాతీయ రహదారిపై భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో దేవస్థానం అధికారులు అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండదిగువ తొలిపావంచా, నమూనాలయం ఇరువైపులా కౌంటర్ల వద్ద సుమారు 40 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. రాజమహేంద్రవరం వైపు వెళ్లే నమూనాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన కౌంటర్‌లో 5 వేల ప్యాకెట్లను విక్రయించినట్లు తెలిపారు. ఎటువంటి తోపులాటలు, వివాదాలు లేకుండా దేవస్థానం సెక్యూరిటీ ద్వారా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన, దిగువన అన్ని కౌంటర్లు కలిపి 60 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించారు.

పుర్హుతికా అమ్మవారికి కంఠాహారం

పిఠాపురం, జూలై 7: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పుర్హుతికా అమ్మవారికి భక్తులు బంగారు కంఠాహారం బహూకరించారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన కంది సూర్యచంద్రరావు, సుజాత దంపతులు 55.46 గ్రాముల బంగారంతో కంఠాహారం తయారు చేయించారు. దీనిని ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. పూజలు అనంతరం అమ్మవారికి అలంకరింప చేశారు. దీని విలువ రూ.4.50 లక్షలు ఉంటుంది. దాతలను ఆలయ ఈవో దుర్గాభవాని, ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు, అమ్మవారి ఫొటోను అందజేశారు.



కంఠాహారం బహూకరిస్తున్న దృశ్యం

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రావులపాలెం, జూలై 7: చోరీ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లికి చెందిన ఖండవల్లి సీతారాముడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గోపాలపురానికి చెందిన కంకటాల వెంకటరమణ కిరాణాషాపులో ఈనెల 3న జరిగిన చోరీ కేసులో నిందితుడు సీతారాముడి నుంచి రూ.1.40లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

ఏజెన్సీ సమాచారం

జగన్ ఇసుక దోపిడీ శకం ముగిసింది: ఎమ్మెల్యే శిరీషాదేవి



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం జూలై 7: రాష్ట్రంలో జూలై 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుండడంతో ఆదివారం రంపచోడవరం తాపీమేస్త్రి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ఇసుక దోపిడీ శకం ముగిసిందని, కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం జూలై 8వ తేదీ నుంచే ఉచితంగా ఇసుక అందుబాటులోకి తీసుకురానుందని, కేవలం లోడింగ్, రవాణా చార్జీలు చెల్లించి ఇసుక ఉచితంగా పొందవచ్చన్నారు. లక్షలాది మంది కార్మికులు, కూలీలకు, ప్రజలకు ఇది శుభవార్త అని ఎమ్మెల్యే శిరీషాదేవి వ్యాఖ్యానించారు.

జనసేనలోకి చేరికలు

రంపచోడవరం జూలై 7: రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం పంచాయతీ ఇర్లపల్లి గ్రామంలో ఆదివారం జనసేన పార్టీలోకి చేరికలు జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి, రంపచోడవరం జనసేన మండలాధ్యక్షుడు పీఆర్పీ శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఐ.పోలవరం పంచాయతీకి చెందిన సోదే వినోద్ కుమార్ మిత్ర బృందం మహిళలతో కలిసి జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు, వీరమహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన రంపచోడవరం మండల ఉపాధ్యక్షుడు రాగాల సురేష్, జనసేన వీరమహిళ రమణి,జిల్లా సంయుక్త కార్యదర్శి నర్సి ఎర్రయ్య, సీతయ్య ఉన్నారు.

వీఆర్వో భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళులు



రంపచోడవరం జూలై 7: రంపచోడవరం గ్రామానికి చెందిన వీఆర్వో మిర్తివాడ గణపతిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వీఆర్వో భౌతికకాయానికి నివాళులర్పించారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ గణపతిరెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ ఉన్నారు.

పాస్టర్‌కు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

రాజవొమ్మంగి జూలై 7: రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి గ్రామానికి చెందిన కేజే నతనియల్ పాస్టర్‌గా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా నతనియల్ అనారోగ్యానికి గురై విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ నతనియల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆదివారం తెలుగుయువత మండలాధ్యక్షుడు బారంగి అనుదీప్ విశాఖపట్నంలో నతనియల్ కుటుంబానికి పదివేల రూపాయలు అందించారు.

ఘనంగా బోనాల పండుగ



ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

అడ్డతీగల, జూలై7: అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామ శివారులోఉన్న ఊడ లమర్రి రేణుకా యల్లమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సాయిరామ్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆలయ పూజారి రాజారావు కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాలభైరవ ఉపాసకులు వీర బృందం ప్రత్యేక అమ్మవారికి హారతులు ఇచ్చారు.

'కోయ భాషను జాతీయ భాషగా గుర్తించాలి'

చింతూరు, జూలై 8: భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ మేరకు కోయ భాషను జాతీయ భాషగా గుర్తించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. ఆదివారం మల్లెతోటలో సంఘ సమావేశం, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడారు. జూలై 21న విశ్వ కోయ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. దేశం మొత్తం మీద నాలుగు కోట్ల మంది జనాభా కోయ భాషను మాట్లాడేవారన్నారు. కోయ భాష గొప్పతనాన్ని సాహిత్యం ద్వారా నేటి తరానికి తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జనరల్ డీఎస్సీ ద్వారా మన్యంలో డీఎస్సీ నియామకాలు చేపట్టిన క్రమంలో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. షెడ్యూల్ పరిధిలో ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రత్యేక చట్టాలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. జీవో నెంబరు మూడు రద్దైన నేపథ్యంలో ప్రభుత్వం ఆదివాసీ యువతకు మేలు చేకూర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో పులివీరయ్య, బీరబోయిన మురళి, సున్నం కన్నయ్య, అగరం కన్నయ్య. పైదా ముత్తయ్య, మడకం సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఐదు పంచాయతీలతో సహా మండలాన్ని విలీనం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

ఎటపాక,జూలై 7: చర్చ జరుగుతున్న ఐదు పంచాయతీలతో పాటు ఎటపాక మండలం మొత్తంను తెలంగాణలో కలపాలని అఖిలపక్ష నాయకులు పూసం రాఘవయ్య, మారాసు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం తోటపల్లి గ్రామంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎటపాక ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుదూర ప్రాంతానికి వెళ్లే పరిస్థితి ఉందని, తెలంగాణకు అన్ని విధాలా సమీపంలో ఉన్న ఎటపాకను తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. ఎటపాకను తెలంగాణలో కలిపితే మరలా మండల కేంద్రాన్ని మార్చాల్సిన పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు జిల్లా కేంద్రాలు మార్చారని ఆరోపించారు. విభజన పేరుతో విలీన మండలాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఉన్నత విద్య చదువుకోవడానికి చాలా ఇక్కట్లు పడుతున్నట్లు చెప్పారు.

నేటి నుంచి ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభం

ఎటపాక, జూలై 7: నేటి నుంచి గుండాల ఇసుక డిపో -1 నుంచి ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమం ప్రారంభంకానుందని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. ఇసుక పంపిణీ బాధ్యతను స్థానిక గిరిజన సొసైటీకి అప్పగించారు. సొసైటీ సభ్యులతో పీవో గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. టన్ను ఇసుక లోడింగ్ చార్జీలతో కలిపి రూ.312గా నిర్ణయించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక లభిస్తుందని చెప్పారు.

మల్లంపూడి గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

రాజానగరం, జూలై 7 : మండలంలో మల్లంపూడిలోని ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అంది స్తున్న భోజనం, వసతి సదుపాయాలను స్వయంగా ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట పాత్రలు, పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి వడ్డించాలని హాస్టల్ నిర్వా హకులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ కె.సరోజినీదేవిని అభినందించారు. దీనిలో భాగంగా పుట్టినరోజు జరుపుకుంటున్న వసతి గృహం విద్యార్థులు శ్రీచరణ్, పి.గణేష్, ఆర్.భువనేష్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు ఉన్నారు.



హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజమహేంద్రవరంలో చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: స్థానిక గాంధీపురంలోని శ్రీ గౌతమీ స్మార్ట్ స్కూల్‌లో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన అండర్-19, అండర్-7 చెస్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 70 మంది పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ చెస్ పోటీల కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, ఆంధ్రా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కల్యాణ్‌కుమార్, సంఘ సభ్యులు విత్తనాల కుమార్, వరదాకుమార్, జి.హేమచంద్రమౌళి, జీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

సుందరీకరణతో పాటు అభివృద్ధి చేస్తాం

● గోదావరి బండ్ పై సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7: రాజమహేంద్రవరాన్ని పూర్తిస్థాయిలో సుందరీకణ చేయడంతోపాటు అభివృద్ధి పథంలో తీసుకువెళ్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక గోదావరి బండ్ రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం గోదావరి రివర్ ఫ్రంట్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులపై నగరపాలక సంస్థ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో ఆయన సమావేశం నిర్వహించారు. పలు పనులపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహన లేమితో నాణ్యతలేని పనులను గత ప్రభుత్వ పాలకులు చేశారని, ఇటువంటి విధానానికి స్వస్తి పలికి ప్రజలతో మమేకమై వారి సూచనల మేరకు అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. పద్మావతి ఘాట్‌లో పిండ ప్రధానం చేసేందుకు వీలుగా గోదావరి నదిలోకి 20 అడుగులు ర్యాంప్ నిర్మాణ బాధ్యతలను మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ చేపతుందన్నారు. అలాగే నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే నిర్మాణం రాబోయే పుష్కరాలలోపు చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌తో చర్చించామన్నారు. అలాగే నగరంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేష్ ఎస్ఈపాండురంగారావు, ఈఈ ఎస్‌హెచ్ మదర్‌షా అలీ, డీఈ బీవీ రమణమూర్తి, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, వై.శ్రీను, దీపు, రెడ్డి మణి, నల్లం శ్రీను పాల్గొన్నారు.



రివర్ ఫ్రంట్‌వ్యూ నమూనాను డిజిటల్ స్ర్కీన్‌పై చూపిస్తున్న దృశ్యం

ఐపిఎస్ ట్రస్ట్ ప్రజలకు ఉపయోగపడాలి

ఐపిఎస్ సేవా సంస్థ, చారిటబుల్ ట్రస్ట్ ప్రజలకు ఉపయోగపడాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం గౌతమి జీవకారుణ్య సంఘంలో ఐపిఎస్ చారిటబుల్ ట్రస్ట్(లండన్) ఆధ్వ ర్యంలో స్థానిక ప్రతినిధి గౌతమ్ బృందం సభ్యులు ఆదివారం వృద్ధులకు చీరలు, లుంగీలు, చిన్నారులకు బుక్స్ బ్యాగ్‌లు పెన్లు పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సేవలందించేందుకు గౌతమ్ బృందం రావడం ఆనందంగా వుందని, పుష్కరాలకు కూడా సేవలందించాలన్నారు. ట్రస్ట్ రీజనల్ మినిస్టర్ రాంబాబు మాట్లాడుతూ ఈ సంస్థ లండన్‌లో 1913లో ఆవిర్భవించి, భారత్‌కు 2019లో, ఏపీకి గత డిసెంబర్లో వచ్చిందన్నారు. పేదరికాన్ని రూపుమాపడమే సంస్థ ముఖ్యఉద్దేశమన్నారు. పుష్కరాలకు మూడు చారిటీ సంస్థలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై7: స్థానిక ఆనం కళాకేంద్రంలో భట్రాజ సంఘ జిల్లా అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అత్యున్నత మార్కులు సాధించిన 16మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికలను పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బహూకరించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భట్రాజు కులంలో రామరాజ భూషణుడు, కాసుల పురుషోత్తమ కవి వంటి ప్రసిద్ధ కవులు న్నారని, ఆదికవి నన్నయకు సహాధ్యాయుడైన నారాయణ భట్టు, సినీగేయ రచయిత రసరాజు వరకూ ఎందరో మహనీయులు ఈ కులానికి చెందిన వారేనని అన్నారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ భట్రాజు కులంలో ఎస్ఆర్ భల్లం, రాళ్లబండి కవితాప్రసాద్ వంటి ఎందరో ప్రముఖులన్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు బీహెచ్ రమాదేవి, సీహెచ్ వెంకటరామరాజు, చిట్టిమన్ని వెంకటరాజు, శివరామకృష్ణ, సీతారామరాజు, ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే శ్రీనివాస్

అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే గోరంట్ల



కడియంలో కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూలై 7: కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని రాజమహేంద్రవరంరూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం కడియం విజయ థియేటర్ వద్ద రూ.2లక్షల మండల నిధులతో కల్వర్టు వైండింగ్, బుర్రిలంకలో రూ.40లక్షలు (మండల నిధులు రూ.20 లక్షలు, పంచాయతీ నిధులు రూ.20లక్షలు)తో నిర్మించే సీసీరోడ్డు కమ్ డ్రైను, రూ.34లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే కడియపులంక జాతీయ రహదారి సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం సమీపం నుంచి రోడ్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పూజలు చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలంలో ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా తాగునీరు, రోడ్లు, డ్రైన్లు వంటి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. జలమిషన్ ద్వారా ప్రతీఇంటికి సురక్షిత మంచినీరు అందించే యోచనలో ఉన్నామని అందుకోసం ప్రణాళికలు చేస్తున్నామన్నారు. రహదారులు మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా సర్వే చేయించి పార్టీలకు అతీతంగా ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణ చేయించే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మోసిగంటి సత్యవతి, వెలుగుబంటి ప్రసాద్, పాటంశెట్టి రాంజీ, పంతం గణపతి, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీనువాసరావు, గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, వరగోగుల వెంకటేశ్వరరావు, గట్టి సుబ్బారావు, నాగిరెడ్డి రామకృష్ణ, ఆదిమూలం సాయిబాబా, గుర్రపు సత్యనారాయణ, పితాని శివరామకృష్ణ, గోరు నాగేశ్వరరావు, షేక్ సిద్దయ్య, మండల జేఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది

● 16వ డివిజన్ సత్కార సభలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7: తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఎంతో కష్టపడిన కార్యకర్తలు రుణం ఏమిచ్చి తీర్చుకోగలనని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం 16వ డివిజన్‌లో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి చలుమూరి సత్యనారాయణ, కుమారుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గోరంట్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 17వ డివిజన్ ఇన్‌చార్జి రొంపిచర్ల ఆంటోని అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఇంత అభిమానం చూపుతున్న కార్యకర్తలకు సదా రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక ప్రజలకు కమ్యూనిటీ హాలు, హైస్కూల్, అర్హులకు గృహాలు, మేజర్ డ్రైనేజీలు, క్లీనింగ్ వంటి పనులన్నీ త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట బ్యాంక్ ఛైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసుదేవ్, మత్సేటి ప్రసాద్, బూర దుర్గాంజనేయరావు, మానుపాటి తాతారావు, యేలూరి వెంకటేశ్వరరావు, సూరంపూడి శ్రీహరి పాల్గొన్నారు.

'చైతన్యనగర్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయించాలి'

కడియం, జూలై 7: కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీలో చైతన్యనగర్‌లో ఉన్న పాఠశాలలో పదో తరగతి వరకు పిల్లలు చదువుకునేలా అప్‌గ్రేడ్ చేయించాలని ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి, ఎంఆర్ పాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ చైతన్యనగర్‌లో ఎక్కువగా పేద, మధ్యతరగతితో పాటు పేపరుమిల్లులో పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే ప్రజ లు ఉన్నారన్నారు. వీరి పిల్లలు పదో తరగతి చదువుకోవాలంటే సుమారు 3 కిలోమీటర్ల మేర అటు కడియం, ఇటు ఎంఆర్‌పాలెం వచ్చి చదువుకునే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో చైతన్యనగర్ పాఠశాలను పదోతరగతి వరకు ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించాలని ఎమ్మెల్యే గోరంట్లను, సర్పంచ్ చంటి కోరారు.

'పారిశుధ్య పనులు మెరుగ్గా నిర్వహించాలి'

ధవళేశ్వరం, జూలై 7: గ్రామంలో పారిశుధ్య పనులు మెరుగ్గా నిర్వహించడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం లో కార్యదర్శి సూరిబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ సీనియర్ నాయకుడు మార్ని వాసుదేవరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పం దూ రి అప్పారావు, యర్రమోతు ధర్మరాజు, ఆళ్ళ ఆనందరావు, తలారి మూర్తి, తదితరులు మాట్లాడుతూ స్పెషల్‌డ్రైవ్ చేపట్టే ప్రాంతాల్లోని కూటమి నాయకుల తో సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. నాళ్ళ రమేష్, సావాడ శ్రీనివాస రెడ్డి, బీరా ప్రకాష్, వర్రే రమేష్, వర్రే చిన్ని, పన్నాల లక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరంరూరల్, జూలై 7: హుక్కుంపేట పంచాయతీ నాగిరెడ్డి నగర్ మూడుగుళ్ల వద్ద చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ పాలకుల చేతుల్లో చాలా గ్రామాలు నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురయ్యాయని, అభివృద్ధి, సంక్షేమం టీడీపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుద్దుపూడి రామకృష్ణ, పెండ్యాల రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, బొప్పన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ధవళేశ్వరం, జూలై 7: 22 సంవత్సరాలు తరువాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. 2001-22లో స్థానిక కాంతరాజు ఎయిడెడ్ పాఠశాలలో 7వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి స్మృతులను నెమరవేసుకుంటూ స్నేహితుల కుటుంబ విషయాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ గడిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితులు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సహచరులను ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

నేడు అనపర్తిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

● అనపర్తి ఏరియా ఆసుపత్రిలో భవన నిర్మాణాలకు భూమిపూజ
● మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 7: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం అనపర్తిలో పర్యటించనున్నారు. ఉదయం 7.40నిమిషాలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి అనపర్తి మండలం రామ వరంలోని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకుంటారు. అక్కడ బ్రేక్ ఫాస్ట్ అనంతరం 9గంటలకు అనపర్తిలోని ఏరియా ఆసుపత్రి అపగ్రేడ్ అయిన సందర్భంగా నూతనంగా నిర్మించనున్న అదనపు భవన నిర్మాణాలకు మంత్రి భూమిపూజ నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుంచి 9.50 నిమిషాలకు బయలుదేరి 10.30కు రాజమహేంద్రవరం చేరుకుని స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో సాయంత్రం 6గంటల వరకు పాల్గొని రాత్రి 9 గంటలకు విజయవాడ చేరుకుంటారు. మంత్రి పర్యటన సందర్భంగా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే భూమిపూజ కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎన్డీయే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురారెడ్డితో మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదు పాయాలను గుర్తించి మంత్రికి వినతిపత్రం అందించాలని సూచించారు. అదేవిధంగా నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటిగా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమమని మంత్రి పాల్గొనే ఈ కార్యక్రమానికి అనపర్తి నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎన్డీయే నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, చౌదరి, మామిడిశెట్టి శ్రీను, గొలుగూరి భాస్కరరెడ్డి, వోగిరెడ్డి రాధ పాల్గొన్నారు.



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

సీఎంల భేటీ సంతోషకరం : మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి హైదరాబాద్ వేదికగా సమావేశం కావడం సంతోషకరమని మాజీ ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ- కేంద్ర ప్రభుత్వ మధ్యవర్తిత్వంతోనే విభజన హామీలపై ఇరు రాష్ట్రాలూ చర్చించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శులు కమిటీ ఏర్పాటు, రెండోసారి మంత్రుల కమిటీ, మూడోసారి ముఖ్యమంత్రులు కూర్చొని చర్చిస్తారనేది జాప్యానికి తావు ఇచ్చే విధంగా ఉందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం షీలా బేడీ కమిటీలో పలుమార్లు ఉభయ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు కూర్చొని చర్చించారన్నారు. ఏపీకి సంబంధించిన పోర్టులలో తెలంగాణ ప్రభుత్వం వాటా అడుగుతుందని, టీటీడీలో కూడా వాటా అడగొచ్చనే కథనాలు వెలువడుతున్నాయన్నారు. విభజన హామీల్లోని షెడ్యూల్ 9, 10కి సంబంధించి సుమారు రూ.లక్షా 50వేలకోట్ల విలువచేసే 100 ఆస్తుల వరకూ ఏపీకి రావాల్సి ఉందన్నారు.

'ఎస్సీలపై దమనకాండపై విచారణ జరిపించాలి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రాష్ట్రంలో ఎస్సీలపై జరిగిన దమనకాండపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి న్యాయవిచారణ జరిపించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్రాధ్యక్షుడు గుడిసె దేవానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. నేషనల్ క్రైమ్ రిపోర్ట్ ప్రకారం ఎస్సీలపై సుమారు 7 వేల దాడులు, హత్యలు, మానభంగాలు జరిగాయని, కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి చావుకు కారణమయ్యారని, ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు సీతానగరంలో దళిత యువకుడ్ని పోలీస్‌స్టేషన్‌లోనే శిరోముండనం చేయడం వంటివి చాలా జరిగాయని, వాటిల్లో బాధితులకు న్యాయం జరగాలన్నారు.ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు, ప్రధాన కార్యదర్శి పల్లి ధర్మేశ్ ప్రసాద్‌కుమార్, పాల్గొన్నారు.

ఉద్యోగ పదోన్నతుల్లో మాదిగలకు ప్రాధాన్యమివ్వాలి

● ఎమ్మార్పీఎస్ కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7: ఉద్యోగ పదోన్నతుల్లో మాదిగలకు ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులో జరిగిన ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంద కృష్ణమాదిగ ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని ఉద్యమాన్ని నడిపారని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తు ఆరోగ్యశ్రీ వంటి పథకాల రూపకల్పనకు కారకులయ్యారని అన్నారు. చాలాశాఖల్లో ఉన్న మాదిగలు పదోన్నతుల్లో ఇబ్బందులు ఉన్నాయని అవి కల్పించడంలో సహకరించాలని ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లను కోరుతున్నామన్నారు. విద్యుత్‌శాఖలో ఉన్న రాంబాబు, శ్యాంబాబులు అర్హత వుండి ఎస్ఈలుగా పదోన్నతులు పొందలేదన్నారు. చిన్న చిన్న కాంట్రాక్టులు చేసుకునే అవకాశాలు కల్పించాలన్నారు. మాదిగ న్యాయవాదులు జాతీయ అధికార ప్రతినిధి కొత్తపల్లి ప్రసాద్ మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యార్లగడ్డ సునీల్, అనంతపురపు యేసురాజు, బాదంపూడి చిట్టిరాజు, చిరంజీవి, అలంతారపు గోపి, ఈతకోట విల్సన్, కొడమంచిలి జాన్‌బాబు, ఇండిగిబిల్లి రవి పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు పరిహారం ఇస్తాం

● ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమించిన రైతులు

కోరుకొండ, జూలై7: కోరుకొండ మండలం మునగాల గ్రామానికి చెందిన 52 మంది రైతులకు 241 ఎకరాలకు సంబంధించి రావాల్సిన సొమ్ములు ఇప్పిస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులకు హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోరుకొండకు చెందిన కావేరి సీడ్స్ ఆర్గనైజర్ అడపా కనకరాజు కోరుకొండ మండలం మునగాల గ్రామంలో గత రబీ సీజన్‌లో ఎకరా పంటను రూ.80వేలకు కొంటామని చెప్పి రైతులకు కావేరి సీడ్స్ నుంచి మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేశారు. పంట పండించిన అనంతరం దిగుబడి తక్కువగా వచ్చిందని చెప్పి ఎకరానికి రూ.55వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మొక్కజొన్న రైతులు తెలిపారు. దీంతో ఆర్గనైజర్ మాటనమ్మి సుమారు 241 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేసిన 52మంది రైతులకు అన్యాయం జరిగింది. దీంతో వారు కోరుకొండలోని కావేరి సీడ్స్ ఆర్గనైజర్ అడపా కనకరాజు ఎరువుల షాపువద్ద నిరసన దీక్ష చేపట్టారు. గతంలో ఇదే విషయం కోరుకొండ వ్యవసాయశాఖ సబ్ డివిజన్ జేడీఏ మల్లికార్జునరావుకు వినతిపత్రం ద్వారా తెలియజేశామన్నారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో దీక్ష చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. సంబంధిత వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావును పిలిపించి మాట్లాడారు. రైతులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని కావేరి సీడ్స్ జనరల్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని రైతులకు వారం రోజుల్లో న్యాయం చేస్తామని తెలిపారు. దీంతో రైతులు శాంతించారు. దీక్ష చేస్తున్న రైతులకు ఎమ్మెల్యే దీక్ష విరమింప చేశారు. ఈ సమావేశంలో మునగాలకు చెందిన పలువురు రైతులు, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, యర్రంశెట్టి పోలారావు, టీడీపీ నాయకులు మాదబోయినఅప్పారావు, కర్రివీరగణేష్, అడపా శ్రీనివాస్, మందపాక వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.


తొస్సిపూడిలో గర్భిణులకు శ్రీమంతాలు



బిక్కవోలు, జూలై 7: తొస్సిపూడిలో ఆదివారం సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. వీరికి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు ఇచ్చి దీవించారు. అనంతరం గ్రామంలోని బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. 40 మంది పిల్లలకు గుడ్లు, కందిపప్పు, చిక్కీలు అందజేశారు. కూటమి నేతలు కొవ్వూరి వెంకటరెడ్డి, కర్రి శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు కొప్పిశెట్టి కామేశ్వరి, మేడపాటి అమ్మాజీ పాల్గొన్నారు. ఆరికరేవుల గ్రామంలో సర్పంచ్ రెడ్డి నాగవేణి కుమారి బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఘనంగా గురుపూజోత్సవం

దివాన్‌చెరువు, జూలై 7: సంఘ స్వయంసేవకులు తను, మన, ధనతోబాటు కొంత సమయాన్ని కూడా సమాజసేవకు సమర్పించాలని ఆర్.ఎస్.ఎస్. జిల్లా ప్రచారప్రముఖ్ వరప్రసాద్ కోరారు. ఆర్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో దివాన్ చెరువులోని గోదావరి విద్యాపీఠం ప్రాంగణంలో గురుపూజోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు విషయాలను వివరించారు. ఆర్.ఎస్.ఎస్. ఖండ కుటుంబ ప్రముఖ్ నీలపాల శ్రీనివాస్, ఖండ పర్యావరణ ప్రముఖ్ గ్రంధిగణేష్, ధర్మజాగరణ ప్రముఖ్ కడియం శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఆదివారం కన్నులపండువగా సాగింది. 6

సెంటు.. మంట!


ఎందుకీ భూమి : దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఊరికి 2 కి.మీ దూరంలో జగనన్న ఇళ్ల కాలనీ కోసం సేకరించిన నివాసయోగ్యం కాని స్థలం.. ఇక్కడ కనీసం ఒక పునాది పడలేదు.

- జగనన్న కాలనీల పేరిట భారీ అవినీతి
- పనికిరాని భూముల్లోనే లేఅవుట్లు
- స్థలాలు ఇచ్చినా లబ్ధిదారుల విముఖత
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- రాజమహేంద్రిలో ఆవ భూములు
- 20 వేల పట్టాలిచ్చినట్టు రికార్డులు
- 50 వేల దరఖాస్తులు పెండింగ్
- స్థలాలు ఇవ్వాలని డిమాండ్
- కూటమి నేతలకు ప్రజల వేడుకోలు

వైసీపీ హయాంలో 'గాలి' పట్టాలు


మా స్థలం చూపండి సార్ : రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు పట్టాలిచ్చి స్థలాలు చూపాలని అడుగుతున్న లబ్ధిదారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పేదోడిని గూడు గోడు వేధిస్తోంది. సొంతింటి కల 'కల'గానే మిగిలిపోతోంది. పేదోడికి సెంటు జాగా కరువైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రేపు ఇస్తాం.. మాపు ఇస్తాం గడిపేశారు. చివరికి కోరుకొండ మండలం బూరుగుపూడి ఆవ భూముల్లో స్థలాలు కేటాయించి చేతులు దులుపుకున్నారు.. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ఎన్నికల ముంగిట హడావుడి చేశారు. పట్టాలు పంపిణీ చేసి ప్రజలను మోసం చేశారు. ఓటు రాజకీయం చేసి ప్రజల మనోభావాలతో ఆటలాడుకున్నారు. వేలాదిగా వచ్చిన దరఖాస్తులను గృహ నిర్మాణ కార్యాలయంలో మగ్గబెట్టారు. చివరికి కేంద్ర ప్రభుత్వం కేటాయించినా వాటిలో నాలుగో వంతు పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో జనం ఎదురు చూస్తున్నారు. తాము పెట్టుకున్న దరఖాస్తులకు గ్రహణం వీడుతుందనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో గృహాలివ్వండి సారూ..

2019కి ముందు టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున టిడ్కో గృహాలు నిర్మించారు. సుమారు 80 శాతం నిర్మాణం పూర్తయిన తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయినా టిడ్కో గృహాలు మాత్రం కేటాయించలేదు.. ఐదేళ్లు ఊరించి ఉసూరుమనిపించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీ కట్టలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.అయినా గత వైసీపీ పాలకులకు ఏం పట్టలేదు.టీడీపీపై ఉన్న రాజకీయ కక్షతో పేదలను ఇబ్బందులకు గురి చేశారు.బ్యాంకులోన్లు కట్టలేక.. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారు.ఆ ఐదేళ్లు ఇంటి అద్దె కట్టలేక సతమతమయ్యారు. ఐదేళ్లు తాము పడ్డ కష్టానికి వైసీపీ నాయకులను బాధ్యులను చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా టిడ్కో గృహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పేదల స్థలాల పేరిట మేత..

వైసీపీ ప్రభుత్వంలో పేదల స్థలాల పేరిట బాగా అవినీతికి పాల్పడ్డారు. పేదల పేరిట పనికిరాని ముంపు భూములను పది రెట్లు ఎక్కువ రేటుకు కొనుగోలు చేసి భారీగా సొమ్ములను జేబులో వేసుకున్నారు. పైగా వాటిని చదును చేస్తున్నామంటూ మట్టిలోనూ మెక్కేశారు. చివ రికి చినుకు పడితే ఆ స్థలాలు వరద గోదావరిని తల పించేవి. రాజమహేంద్రవరం నియోజకవర్గంలో అయితే మరీ దారుణం. ఏకంగా కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆవ భూమిని కొనుగోలు చేసి సెంటు చొప్పున పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఆ భూమిని ఇంటి నిర్మాణానికి ఆమోదయోగ్యంగా ఉండదు. చినుకు పడిందంటే చెరువైపోతోంది.మామూలుగా ఆ ఆవ భూమి రెండు తాడిచెట్ల లోతు నీటితో నిండి ఉంటుందని స్థానికుల సమాచారం. దీనిపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జిల్లాలో జగనన్న కాలనీలు ఆరంభించని నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరమే. సెంటు జాగా కోసం వైసీపీ నేతలు జనాలను వేధించుకుతిన్నారు. వైసీపీ హయాంలో ప్రజలు గూడుకు ఇచ్చిన దరఖాస్తులు వేలాదిగా గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో పేరుకుపోయాయి.అదిగో స్థలం.. ఇదిగో ఇల్లు అంటూ దరఖాస్తులను మగ్గబెట్టారు.కూటమి ప్రభుత్వంలో వాటికి మోక్షం కలుగుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పనికిరాని భూములే స్థలాలుగా..

జిల్లాలోని వైసీపీ నేతలు ప్రజలు కళ్ల ముందే కనికట్టు చేశారు. ఎందుకూ పనికిరాని భూములను కొనుగోలు చేసి స్థలాల కింద కేటాయించారు. జిల్లాలోని తాళ్లపూడి మండలం నూరాయిపేట, బల్లిపాడులో స్థలాలు కేటాయించడంతో పెద్ద వివాదమే నడిచింది. ఆయా స్థలాల లబ్ధిదారులు ఏకంగా గత కలెక్టర్ మాధవీలతను నిలదీశారు. నివాసయోగ్యం కాని భూములు మాకొద్దంటూ నిరసన తెలిపారు. బల్లిపాడు లబ్ధిదారులకు తిరుగుడు మెట్టలో స్థలాలు కేటాయించినా అక్కడా అదే పరిస్థితి. ఏ ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోలేదు.దేవరపల్లి మండలం కృష్ణపాలెం,ధుమంతునిగూడెం గ్రామస్థులకు కృష్ణపాలెం పరిధిలో ఉన్న పోలవరం కాల్వ గట్టు పక్కన సుమారు 275 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ స్థలాలు వర్షాకాలంలో ముంపునకు గురవుతాయి.దీంతో ఆ స్థలాలు మాకొద్దంటూ లబ్ధిదారులు జాతీయ రహదా రిపైనే బైఠాయించి నిరసన తెలిపారు. గత కలెక్టర్ మాధవీలత వచ్చి పరిశీలించి ఎటూ తేల్చకుండా వదిలే శారు. యర్నగూడెంలో ఊరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు విముఖత వ్యక్తం చేశారు.ఆ స్థలాలు మాకొద్దు మార్చాలని డిమాండ్ చేశారు. అయినా ఫలితం లేకపో యింది. ఇక రాజమహేంద్రవరం రూరల్ మండలం వేమ గిరిలోనూ పనికిరాని స్థలాలను పేదలకు ఇచ్చారు. వేమగిరి కొండదిగువన స్థలాలు కేటాయిం చినట్టు సమాచారం. దీనిపై గతంలో కడియం మండల కార్యాలయాన్ని మహిళలు పెద్ద ఎత్తున ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని నాటి కలెక్టర్ మాధవీలత హామీ ఇచ్చారు. నేటికీ ఆ హామీ అలాగే మిగిలి ఉంది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనూ ఇదే పరి స్థితి నెలకొంది. ఏకంగా ఆవ భూములనే స్థలాలుగా కేటాయించారు. బూరుగుపూడి వద్ద నివాస యోగ్యం కాని సుమారు 600 ఎకరాల ఆవ భూమిని ఎంపిక చేశారు. అప్పటి కలెక్టర్ కూడా వైసీపీ నాయకులకు తన వంతు సహకారాన్ని అందించారు. ఇదే అదనుగా వందల కోట్ల రూపాయలు నొక్కుడుకు తెర తీశారు. ఎకరం ఏడు లక్షలు కూడా చేయని భూములను ఏకంగా రూ.45 లక్షలు పెట్టి కొనడానికి ప్లాన్ వేశారు. ఆ సొమ్ములు భూమి ధర రైతుకు ఇచ్చేసి మిగతా సొమ్మును భారీగా దోపిడీ చేయాలనుకున్నారు. ఈ తంతంగంలో సుమారు రూ.500 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. భూమిని చదును చేయడానికి కూడా కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ వ్యవహారం వైసీపీలోని ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధుల మధ్య గొడవకు దారితీసినట్టు సమాచారం.ఈ భూముల్లో పట్టాలంటూ వేలాది మందికి పత్రాలను పంచి పెట్టారు.కానీ ఇప్పటికీ అక్కడ జనం నివసించడానికి సాహసించడం లేదు.అయితే స్థానిక రైతులు భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ప్రజల ఇళ్ల పేరిట అప్పటి ప్రభుత్వం ఖర్చు పెట్టిన కోట్లాది రూపాయలు ఎవరి గళ్లా పెట్టెలోకి వెళ్లాయో సీబీసీఐడీతో వెలికి తీయించాలనే డిమాండ్లు బలంగా వినవస్తున్నాయి. ఈ దోపిడీపై మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు అప్పట్లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇక ఎన్నిక షెడ్యూల్‌కి వారం ముందు నుంచీ మాజీ ఎంపీ భరత్ రామ్ కొత్త సినిమాకు తెరతీశారు. కాగితంపై స్థలాలను చూపిస్తూ కనికట్టు చేద్దామనుకున్నారు. అసలు భూమి లేకుండా 25 వేల పట్టాల పంపిణీ అంటూ హడావుడి మొదలు పెట్టారు.వారం పాటు మునిసిపల్, సచివాలయ సిబ్బందికి నిద్రాహారాలు లేకుండా చేసి పట్టాలను తయారుచేయించారు. కానీ ఆ స్థలాలు ఎక్కడ ఉన్నాయో మాత్రం చూపించలేక పోయారు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతంపేటకు చెందిన ఒక లబ్ధిదారురాలు తన స్థలం చూపించాలని ఎంత మొత్తుకున్నా సచివాలయ సిబ్బంది మాత్రం సాహసం చేయలేకపోయారు.మాజీ ఎంపీ హడావుడిగా పప్పుబెల్లం మాదిరిగా ఇచ్చేసిన పట్టాలకు సంబంధించిన స్థలాలను తమకు చూపించా లని.. లేకపోతే బహిరంగంగా క్షమాపణచెప్పాలని పెద్ద సంఖ్యలో డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సారూ.. మా స్థలం ఎక్కడ?

గత వైసీపీ ప్రభుత్వం ఓట్ల కోసం చెప్పిన అబద్ధాలకు ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సమాధానం చెపుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఐదేళ్లలో రాజమహేంద్రవరంలో 20 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఇంకా 50 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే సిటీ నియోజకవర్గ పరిధిలో పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించకపోవడం గమనార్హం. దీంతో ప్రస్తుత కూటమి ప్రజాప్రతినిధులు సమస్యలు తెలుసుకోడానికి ప్రజల వద్దకు వెళుతుంటే వారు వైసీపీ ఇచ్చిన మోళీ పట్టాలతో స్వాగతం పలుకుతున్నారు. తమ స్థలాలు చూపించాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో వారిని సముదాయించడం టీడీపీ నేతలకు పెద్ద పనిగా మారిపోయింది. అసలు స్థలాలే లేకుండా పట్టాలు చేతిలో పెట్టి మోసం చేశారని వివరిస్తుంటే పాపం ఆ పేదలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇక కాలనీలు అంటూ మొదలు పెట్టి అతీగతీ లేకుండా వదిలేసిన ఇళ్ల మాటేమిటని ప్రశ్నిస్తున్న లబ్ధిదారులూ ఉన్నారు. వాళ్లనూ తాము ఆదుకుంటామని టీడీపీ నేతలు హామీ ఇస్తున్నారు. గతంలో తమ హయాంలో జరిగిన ఇళ్ల పంపిణీ మాదిరిగానే పారదర్శకంగా సొంత ఇంటి కల నెరవేరుస్తామని చెబుతున్నారు. ఇప్పుడు నిజంగా టీడీపీ ప్రజా ప్రతినిధులపై ఉన్న పెద్ద బాధ్యత కూడా ఇదే. ప్రభుత్వ కార్యాలయాల్లో మగ్గిపోతున్న దరఖాస్తుల దుమ్ము దులిపి తగు విచారణ చేయించి ఇంటి సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో దగా పడిన పేదోడి గూడుకు రూపం ఇవ్వాల్సిన నైతికత కూడా ఈ పాలకులపైనే ఉంది.

స్థలాల అవినీతిపై సీబీసీఐడీ విచారణ..

గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల్లో భారీ మోసమే జరిగింది.. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో అయితే స్థలాలు చూపకుండానే పట్టాలిచ్చేశారు. ముందు పనికిరాని ఆవ భూములను కొనుగోలు చేసి ప్రజలను మభ్యపెట్టారు. ఇది చాలా దారుణం. దీనిపై సీబీసీఐడీ విచారణ జరిపించాలి. ఈ మేరకు సీఎంకు విన్నవిస్తా. పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వం.. అందరికీ నివాసయోగ్యమైన స్థలాలు ఇస్తాం.

ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమహేంద్రవరం సిటీ


కొవ్వూరు ర్యాంపులో ఇసుక గుట్టలు పరిశీలిస్తున్న అధికారులు



మిగిలిన ఇసుకెంత

- నేటి నుంచి ఉచిత ఇసుక విధానం
- స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ అధికారుల పంపిణీ
- కుమారదేవం పాయింట్ నుంచి సరఫరా

రాజమహేంద్రవరం- (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు/పెరవలి, జూలై 7 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్న సంగతి తెలిసిందే.దీని కోసం జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేశారు.రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇది అమలు కానుంది. ఒక్కో స్టాక్ పాయింట్ వద్ద ఒక ఆర్ఐ, ఐదుగురు వీఆర్వోలను నియమించారు. ఇసుక టన్నుకు సుమారు రూ.200 పైగా ఉండవచ్చని చెబుతున్నారు. ఈ ధరలు ఇంకా ఖరారు కాలేదు. ర్యాంపుల నుంచి స్టాక్ పాయింట్ల వరకూ దూరాన్ని బట్టి, ఆయా స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ధర ఉంటుంది. జిల్లాలోని కాతేరు, లాలాచెరువు, బుర్రిలంక, కుమారదేవం-చిడిపి, పందలపర్రు, పెండ్యాల, ఉసులుమర్రులోని ఏడు స్టాక్ పాయింట్లలో 3 లక్షల టన్నుల ఇసుక ఉంది. దానినే ముందు విక్రయిస్తారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఇదిలా ఉండగా ర్యాంపుల్లో ఇసుక నిల్వలపై మైన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం ఆరా తీశారు. పెరవలి మండలం తీపర్రు, కొవ్వూరు, వాడపల్లి, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపుల్లో ఇసుక నిల్వలను మైన్స్ ఏజీ విఘ్నేష్, కొవ్వూరు తహశీల్దార్ కె. మస్తాన్‌లు సిబ్బందితో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభిస్తున్నందున అధికారులు ర్యాంపుల్లో నిల్వ ఉన్న ఇసుక ఎంత మేర ఉందో పరిశీలించి నిల్వ ఉన్న ఇసుక గుట్టలను నమోదు చేసుకున్నారు.కొవ్వూరు మండలం కుమారదేవం స్టాక్ పాయింట్ నుంచి సోమవారం ఉచిత ఇసుక రవాణా ప్రారంభిస్తారన్నారు. తీపర్రు - ఉసులుమర్రు మధ్య గల ఇసుక గుట్టల నుంచి ఉచిత ఇసుక పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అధికారులు అక్కడకు వచ్చి పరిశీలించారు.పడవ యజమానులకు గతంలో ప్రభుత్వం టన్నుకు రూ. 200లు ఇచ్చేదని.. ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం పడవ యజమానులకు ఇచ్చే ధరను పెంపుదల చేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ర్యాంపుల్లో నిల్వ ఉన్న ఇసుకను ముందుగా విక్రయించాలని కోరగా స్టాక్ పాయింట్లు పూర్తయిన తరువాత పడవ ర్యాంపులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించి విధి విధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉందని సోమవారం ఉదయం కలెక్టర్ ఆదేశాలు మేరకు ఇసుక పంపిణీ చేస్తామని తెలిపారు.ర్యాంపులను మైన్స్ ఏజీ విఘ్నేష్, తహశీల్దార్ కె.మస్తాన్, డిప్యూటీ తహశీల్దార్లు అజయ్‌కుమార్, కనకదుర్గ, సర్వేయర్ గోపాలకృష్ణ, ఇసుక స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి సన్నిబాబు, ఎస్ఐ మూర్తి, తీపర్రు ఉసులుమర్రు వీఆర్వోలు సుబ్బారావు,రవి పరిశీలించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7 : జిల్లా వ్యాప్తంగా జూలై 8 సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో అధికారులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) అనేది సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ అని ఇది పౌరులు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేయడానికి అనుమతిస్తుందన్నారు. 1902 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కలెక్టరేట్‌లో, డివిజన్, మునిసిపల్,మండల స్థాయి ప్రధాన కార్యాలయాల్లో అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించాలన్నారు.


హోటల్ మంజీరాలో రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సిద్ధమైన వేదిక.. సభా ప్రాంగణంలో మోదీ పథకాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నేడు బీజేపీ సందడి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఏర్పాట్లు - 2250 మందికి ఆహ్వానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం కాషాయరంగు పులుముకుంది. ఎటు చూసినా బీజేపీ ఫ్లెక్సీలతో నిండిపోయింది.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నేపథ్యంలో సోమవారం సందడి నెలకొంది.రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీజేపీ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం తొలిసారిగా ఇక్కడ జరగనుంది. ఈ ఎన్నికల్లో ఊహించని విధంగా బీజేపీ ఫలితాలు సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు. ముగ్గురు ఎంపీలు గెలిచిన సంగతి తెలిసిందే.దాంతో పాటు తమ కూటమి ప్రధాన భాగస్వామ్య పార్టీ తెలుగుదేశం 134 సీట్లు , మరో భాగస్వామ్య పార్టీ జనసేన 21 స్థానాలు సాధించాయి. దీంతో అప్పటి అధికార వైసీపీని మట్టి కరిపించి కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేసిన జోష్ పార్టీలో కనిపిస్తోంది.అంతే కాదు కేంద్రంలో కూడా మోదీ మూడోసారి ప్రధాని కావడం కూడా ఈ పార్టీకి మరింత ఉత్సాహాన్ని కల్పిస్తోంది. ఇదిలా ఉండగా తొలిసారి బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంజీరాలో జరగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన సోమవారం ఉదయం సుమారు 10 గంటలకు సమావేశం జరగనుంది. గత ఐదేళ్లలో రాష్ట్రం విచ్ఛిన్నమైంది. అప్పులపాలైంది. అభివృద్ధి లేదు. అరాచకం తాండవమాడింది. రాష్ట్ర విభజన అంశాలు అనేకం సాధించుకోవాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టును కుదేలు చేసింది.రాజధాని అమరావతి నిర్మాణాన్ని అర్థంతరంగా ఆపేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ రాష్ట్రం అభివృద్ధి కోసం ఇక్కడ ఏ ఏ అంశాలపై చర్చించనున్నదనేది ఆసక్తిగా మారింది. వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. పలు సందర్భాల్లో పురందేశ్వరి కూడా ఇదే చెప్పారు. దీనిపై తీవ్ర చర్చ జరగనుంది. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతిపై ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక రాష్ట్రంలో బీజేపీ బలపడే విధంగా కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.గతంలో ఎన్నడూ రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యేలు లేరు.ఈసారి ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ముగ్గురు గెలిచారు.క్రమంగా స్థానిక ఎన్నికలు వస్తాయి. నామినేటెడ్ పదవులు ఉంటాయి. పార్టీ ఎదు గుదల, గుర్తింపుపై చర్చించడంతో పాటు గతం కంటే ఆంధ్రలో పార్టీ మెరుగుపడేందుకు కొన్ని తీర్మానాలు చేసే అవకాశం ఉంది. ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా ఉంటుందని చెబుతున్నారు.సమావేశానికి కేంద్రమంత్రులు కె.మురుగన్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు అసెంబ్లీ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు హాజరవుతారు. మొత్తం 2,250 మందికి ఆహ్వానం పంపారు.ఇప్పటికే చాలా మంది నేతలు రాజమహేంద్రవరం చేరుకున్నారు.జిల్లాలోని నేతలు పలు బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లపై పురందేశ్వరి చర్చించారు.నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు.అతిథులకు రూమ్‌లు ఏర్పాటు ,సిటీ డెకరే షన్,స్టేజ్ ఏర్పాటు, ఎయిర్‌పోర్ట్ వద్ద రైల్వే, బస్టాండ్ల వద్ద ప్రముఖులకు స్వాగతం పలకడానికి పలు కమిటీలు వేశారు.

దీవించమ్మా.. కోట సత్తెమ్మ



నిడదవోలు, జూలై 7 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయానికి ఆదివారం పలు జిల్లాల భక్తులు పోటెత్తారు. కోట సత్తెమ్మ దీవించమ్మా అంటూ వేడుకున్నారు. కోటసత్తెమ్మకు ఆలయ అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, దూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి క్షీర నివేదన,మహానివేదన చేశారు. భక్తులు ఉచిత దర్శనం,ప్రత్యేక దర్శనం ద్వారా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారికి రూ.1,79,636లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

జిల్లా ఆసుపత్రి సంగతేంటి!



- జిల్లా ఆసుపత్రికి ప్రజల ఎదురుచూపులు
- కొవ్వూరులో ఏర్పాటు చేస్తారని వాదన
- జీజీహెచ్‌లో అవినీతి రోగం.. రోగుల ఇక్కట్లు
- నేడు వైద్య శాఖ మంత్రి రాక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7 : జిల్లా విభజన జరిగింది.. మెడికల్ కళాశాల ఏర్పాటైంది.. అయితే జిల్లా ఆసుపత్రిపై మాత్రం నేటికీ మీమాంస నెలకొంది..గత వైసీపీ ప్రభుత్వం నేడు.. రేపు అంటూ నెట్టుకొచ్చేసింది. ఎటువంటి కదలిక లేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లా ఆసుపత్రి సంగతి తేల్చాలని జిల్లా వాసులు పట్టుబడుతున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో కొవ్వూరులో జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా వినిపిస్తోంది. జిల్లాల పునర్విభజన తర్వాత కొవ్వూరు, నిడదవోలు, తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి తదితర మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో కలవడంతో ఆయా మండలాల నుంచి మెరుగైన వైద్యం కోసం రోగులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో రాజమహేంద్రవరంలో జిల్లా ఆసుపత్రి ఉండేది. ఇప్పుడు జీజీహెచ్‌గా మారడంతో కొవ్వూరులో జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వినిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అనపర్తి లేదంటే కొవ్వూ రులో జిల్లా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తారనే వాదనలు వినిపించాయి. కొవ్వూరులో సకల సౌకర్యాలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రికి తగినట్టుగా ఏర్పాట్లు ఉన్నాయి. మరో వైపు కొవ్వూరును ఆనుకుని ఉన్న జాతీయ రహదారి ఆసుపత్రి ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. జాతీయ రహదారి మీదనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి.అదే విధంగా ఆసుపత్రి ఆవరణ కూడా భారీగా ఉండడంతో దానికే ఓటేశారు. అంతే కాకుండా కొవ్వూరు జిల్లాకు మధ్యస్తంగా ఉంటుంది.అటు నిడదవోలు, గోపాలపురం, ఇటు రాజమ హేంద్రవరం,రాజానగరం, అనపర్తి ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజానీకం ఎదురుచూస్తున్నారు.

జీజీహెచ్‌లో అవినీతి..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు అవినీతి అనే మొండిరోగం పట్టుకుంది. జీజీహెచ్‌లోని జలగలు ప్రతి పనికీ ఒకరేటు పెట్టి పీల్చేయడం నిత్యకృత్యంగా మారింది. ప్రభుత్వం అందించే ఉచిత వైద్యం ఇక్కడ పక్కా కమర్షియల్‌గా మారిపోవడం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది. క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, నర్సింగ్ ఇలా ఏ విభాగం టచ్ చేసినా డబ్బు ... డబ్బు అనే మాట వినిపిస్తోంది. మెరుగైన వైద్యసేవల మాట దేముడెరుగు వైద్య సిబ్బందికి ముడుపులు ఇచ్చుకోలేక సామాన్యులు నరకయాతన పడుతున్నారు. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండే పేదలు, సామాన్యులు వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఆసుపత్రిలోని కొందరు సిబ్బంది టెస్టులకు డబ్బుల కోసం జలగల్లా పట్టి పీడిస్తుండడంతో జీజీహెచ్ పరువు రోడ్డున పడుతోంది. ఆసుపత్రి ఉన్నతాధికారులకు ఈ విషయాలన్నీ స్పష్టంగా తెలిసినా అదిగో విచారణ వేశాం, నివేదిక వచ్చాక చూద్దాం అంటూ చేస్తున్న ప్రకటనలు విమర్శలకు దారితీస్తున్నాయి. కాలయాపన తప్ప తీసుకున్న చర్యలు లేకపోవడంతో అమ్మో పెద్దాసుపత్రికా.. అంటూ సామాన్య రోగులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ వంటి టెస్టులకు ప్రజానీకం డబ్బులకు డబ్బులు చెల్లిస్తూనే వైద్యం కోసం మూడు చెరువుల నీళ్లు తాగాల్సి వస్తోంది.

ఎంఎస్‌వోలపై చర్యలేవి..

జీజీహెచ్‌లో ప్రధానంగా ఎంఎస్‌వో విభాగం అవినీతి ఆరోపణలతో భ్రష్టుపట్టి పోయింది. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఏ కారణం చేతనో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్ (ఎంఎస్‌వో)ను ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగించడం విస్మయానికి గురి చేస్తోంది. నర్సింగ్ విభాగంలోనూ పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆ విభాగం బాధ్యులుగా ఉన్న సిస్టర్ ఒకరు ఇటీవల తన కిందిస్థాయి నర్సింగ్ స్టాఫ్‌తో ఆఫీసు కోసం అంటూ ఏసీ, ప్రింటర్, ఫ్రిడ్జ్ కొనిపించినట్టు ఆరోపణలున్నాయి. ఐసీయూల్లో సిస్టర్లు విధులు సక్రమంగా నిర్వర్తించడలేదనే ఫిర్యాదులున్నాయి. ఐసీయూలో గత 15 రోజులుగా వైద్యం చేస్తున్నా తమ బంధువులు కోలుకోలేదని, మరింత మెరుగైన వైద్యం అందించాలని కోరితే ఐసీయూ సిస్టర్లు పేషెంట్ డిశ్చార్జి పెట్టారంటూ ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి ఒకరు కన్నీళ్లతో ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఓపీ రిజిస్ట్రేషన్లలోనూ సమస్యలున్నాయి. ఎంఎస్‌వోలు, నర్సింగ్, ఓపీ, మెడికల్ క్యాజువాలిటీ వంటి కీలకమైన విభాగాల్లో అవినీతి పెరగడంతో పేదలు, సామాన్యులు పెద్దాసుపత్రి అంటేనే బెంబేలెత్తిపోతున్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7 : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉదయం 7:40 గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా ఉదయం 8:50 గంటలకు అనపర్తి చేరుకుంటారు. అనపర్తిలో ఉదయం 9 గంటల నుంచి ఉదయం 9:40 గంటల మధ్య వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేస్తారు.ఉదయం 10:30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొంటా రు. సాయంత్రం 6 గంటల తర్వాత రోడ్డు మార్గం గుండా బయలుదేరి రాత్రి 9 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

ఘనంగా అల్లూరి వెంకటేశ్వరరావు జయంతి


రక్తదానం చేస్తున్న అవంతి సిబ్బంది

కొవ్వూరు, జూలై 7: విద్యావేత్త, అవంతీ ఫీడ్స్ వ్యవస్థాపకుడు అల్లూరి వెంకటేశ్వరరావు జయంతిని కొవ్వూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు, దేవరపల్లి మండలం బందపురం అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీల్లో రాజమహేంద్రవరం జీజీహెచ్ ప్రభుత్వ రక్తదాన కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. 150 మంది సిబ్బంది రక్తదానం చేశారు. అలాగే పశివేదల జడ్పీ హైస్కూల్లో అవంతి ఫౌండేషన్ ఆధర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు వైద్య సేవలందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కేవీ రాజు, డి.రామకృష్ణ, ఎన్.హరగోపాల్, వై.రామచంద్రం, వి.అమ్మిరాజు, జి.శ్రీనివాసరావు, వైవీ కృష్ణారావు, జేవీవీ రామారావు, ఏబీఎస్ హెల్త్ క్లినిక్, కిమ్స్ బొల్లినేని డాక్టర్లు, అవంతి ఫీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్వీ సుబ్బారావు ఆధ్వర్యంలో అధ్యాపకులు వాత్సల్యా వృద్ధుల ఆశ్రమానికి నిత్యవసరాలను అందజేశారు.

కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి

కొవ్వూరు, జూలై 7: కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో నిలుపుదల చేసిన రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానిక నూలు వారి సత్రం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవిడ్ అనంతరం దేశంలో అన్ని రైల్వేస్టేషన్లలో రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించారని, కొవ్వూరులో పునరుద్ధరించకపోవడంతో పోలవరం ఏజెన్సీతో పాటు, కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాల్లో సుమారు 100 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై త్వరలో నరసాపురం ఎంపీ, కేంద్ర మంత్రి వర్మను కలిసి వినతిపత్రం అందించనున్నామన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి రద్దు చేసిన రైళ్ల పునరుద్దరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రైల్వేశాఖను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాజీబు జగన్నాధరావు, పడాల సుబ్బారెడ్డి, వైకె శ్రీనివాస్, విల్సన్‌రాజు, కంకటాల రాంబాబు, కొండపల్లి రత్నసాయి, టీడీఎల్ ప్రసాద్, రమణ, వల్లూరి రది సుందరం, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం


నిడదవోలులో గురుపూజోత్సవంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

నిడదవోలు, జూలై 7: విద్యార్థులు భారతీయ సంస్కృతి హిందూ ధర్మం విశిష్టత తెలుసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ప్రతినిధి అంజనీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని మదన గోపాలస్వామి ఆలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల చరిత్రలు చదవాలని, దేశానికి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పీవీ సత్యనారాయణ, గమిని వెంకటరత్నం, వేదుల జనార్ధనరావు, వేదుల శ్రీదత్త, శ్రీకాకోళపు పురుషోత్తం, నిడమర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ప్రత్యేక పారిశుధ్య పనులు


దేవరపల్లిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, జూలై 7: పరిసరాల పరిశుభ్రం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్ తెలిపారు. గ్రామంలోని చెత్తా చెదారాలను నాలుగు ప్రొక్లెయినర్లు, ఆరు లారీలు, 12 ట్రాక్టర్లతో యుద్ధ ప్రతిపాదికన తొలగించామన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లడం, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయడం, పైపులైన్ల లీక్‌లు సరి చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

ఉండ్రాజవరం, జూలై 7: పరిసరాలు పరిశుభ్రతకు ప్రజలకు సహకరించాలని చివటం గ్రామ సర్పంచ్ ఈడ్పుగంటి సత్యనారాయణ కోరారు. ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ప్రధాన రహదారి ప్రాంతాల్లో చెత్తచెదారాలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణవేణి, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' గోపాలపురం నూతన కార్యవర్గం


శాంతిరథాన్ని ప్రారంభిస్తున్న దాత సత్యనారాయణ

గోపాలపురం, జూలై 7: మానవత సంస్థ మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్థానిక ఏఎంసీ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పప్పు సత్యకృష్ణారెడ్డి, కార్యదర్శిగా కుక్కల కీర్తికుమార్, కోశాధికారిగా గెడా జోగేంద్రప్రసాద్, ఉపాధ్యాక్షునిగా రాపాక ఫణికిషోర్, మరికొందరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పెద్దాపురం గ్రామానికి చెందిన పద్మసాయి ఫైనాన్స్ అధినేత తానింకి సత్యనారాయణ తన తండ్రి తానింకి రామారావు జ్ఞాపకార్థం శాంతిరథాన్ని మానవత కమిటీకి బహూకరించి ప్రారంభించారు. దీంతో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు, ఆలపాటి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ రాంబాబు, శేఖర్, మరపట్ల హరికృష్ణ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న యువగళం సభ్యులు


తిరుమలలో ఎమ్మెల్యే ముప్పిడితో యువగళం టీం సభ్యులు

తాళ్లపూడి, జూలై 7: మండలంలో అన్నదేవరపేట యువగళం సభ్యులు టీడీపీ విజయం కోసం మొక్కుకున్న మొక్కును తీర్చుకున్నారు. తిరుమల అలిపిరి మెట్ల నుంచి కాలినడకన వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కును తీర్చుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి దర్శనం అనంతరం యువగళం టీం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, నాదెళ్ల శ్రీరాం, మద్దిపట్ల సురేష్, బొడ్డు కేశవ్, ఉండవల్లి గోపాల్, అల్లూరి శివ, ఈడుపుగంటి సుబ్బారావు పాల్గొన్నామన్నారు.

రాజమహేంద్రవరంలో చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: స్థానిక గాంధీపురంలోని శ్రీ గౌతమీ స్మార్ట్ స్కూల్ లో ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన అండర్-19, అండర్-7 చెస్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 70 మంది పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ చెస్ పోటీల కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, ఆంధ్రా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కల్యాణ్‌కుమార్, సంఘ సభ్యులు విత్తనాల కుమార్, వరదాకుమార్, జి.హేమచంద్రమౌళి, జీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో

అపారిశుధ్యం

- ›› డ్రైనేజీలు నిర్మించని వైసీపీ ప్రభుత్వం
- ›› చిన్నపాటి వర్షానికే నిలిచిపోతున్న నీరు
- ›› దుర్వాసన, దోమలతో సిబ్బందికి ఇబ్బందులు
- ›› సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని భయాందోళన

కొవ్వూరు, జూలై 7: ఇటీవల కురిసిన వర్షాలకు కోర్టు ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచి అపారిశుధ్యం తాండవిస్తోంది. కోర్టు ప్రాంగణంలో పట్టణ పోలీసు స్టేషన్, సబ్ ట్రెజరీ, కోర్టులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాలకు ప్రతినిత్యం వేలాది మంది వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు.


అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా నిలిచిన వాననీరు


కొవ్వూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లే సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

అగ్నిమాపకశాఖ కార్యాలయం ఎదురుగా, పట్టణ పోలీస్టేషన్‌కు వచ్చే రోడ్డులో, కోర్టు ప్రాంగణం వద్ద సీసీ రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోయి కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించి గత టీడీపీ ప్రభుత్వంలో కోర్టు ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టక పోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. దీనికి తోడు అగ్నిమాపక శాఖ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్ ఆంధ్రా బ్యాంకు ఎదుట ఉన్న డ్రైనేజీ పూడిపోవడంతో వర్షపునీరు ముందుకు వెళ్లే దారి లేకపోవడంతో నీరు ఎటూ కదలక అక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దోమలకు నిలయంగా మారుతోంది. వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని జాగ్రత్తలు పాటించాలని చెప్తున్న అధికారులు రోజుల తరబడి వర్షపునీరు నిలిచిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రతిరోజు వేలాది మంది సంచరించే కోర్టు ప్రాంగణం వైపు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయినా మున్సిపల్ అధికారులు స్పందించి కోర్టు ప్రాంగణం, అగ్నిమాపకశాఖ కార్యాలయం, పట్టణ పోలీస్టేషన్‌ల వద్ద నిలిచిన వర్షపునీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని అధికారులు, న్యాయవాదులు కోరుతున్నారు.

నేడు రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరగనుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రానున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుండడంతో ఆ పార్టీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆహ్వానితులకు గూగుల్ ఫార్మాట్‌లో అప్లికేషన్ ద్వారా సమ్మతి పంపించారు. ఎంపీ పురందేశ్వరి ఆహ్వానితులను ఆడియో కాన్ఫరెన్స్‌లో ఆహ్వానించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఘనంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర


జగన్నాథ రథయాత్ర, రథం లాగుతున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: స్థానిక గౌతమీ ఘాట్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) వారితో స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్రను మధ్యాహ్నం 3గంటలకు జోనల్ సెక్రటరీ రేవతి రమణ్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, సత్యగోపీనాథ్ దాస్ ఇస్కాన్ సేవలను కొనియాడారు. భక్తులతో పాటు పురందేశ్వరి, దుర్గేష్ జగన్నాథ రథాన్ని లాగారు. రథయాత్ర రామాలయం సెంటర్ నుంచి గోరక్షణపేట, అజాద్ చౌక్, జాంపేట చర్చి, వెజిటబుల్ మార్కెట్, టీటీడీ కాలేజి, డీలక్స్ సెంటర్ హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర గుడి నుంచి ఇస్కాన్ గుడి వరకు సాగి ముగిసింది. అనంతరం సత్సంగ్ ప్రవచనాలు, మహా మంగళహారతి, సాంస్కృతి కార్యక్రమాలు, నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిపారు.

సీఎంల భేటీ సంతోషకరం: మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి హైదరాబాద్ వేదికగా సమావేశం కావడం సంతోషకరమని మాజీ ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మధ్యవర్తిత్వంతోనే విభజన హామీలపై ఇరు రాష్ట్రాలూ చర్చించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శులు కమిటీ ఏర్పాటు, రెండోసారి మంత్రుల కమిటీ, మూడోసారి ముఖ్యమంత్రులు కూర్చొని చర్చిస్తారనేది జాప్యానికి తావు ఇచ్చే విధంగా ఉందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం షీలా బేడీ కమిటీలో పలుమార్లు ఉభయ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు కూర్చొని చర్చించారన్నారు. ఏపీకి సంబంధించిన పోర్టులలో తెలంగాణ ప్రభుత్వం వాటా అడుగుతుందని, టీటీడీలో కూడా వాటా అడగొచ్చనే కథనాలు వెలువడుతున్నాయన్నారు. విభజన హామీల్లోని షెడ్యూల్ 9, 10కి సంబంధించి సుమారు రూ.లక్షా 50వేల కోట్ల విలువ చేసే 100 ఆస్తుల వరకూ ఏపీకి రావాల్సి ఉందన్నారు.

దమనకాండపై విచారణ జరిపించాలి

ఎంపీ పురందేశ్వరికి ఎస్సీ మోర్చా రాష్ట్రాధ్యక్షుడి వినతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రాష్ట్రంలో ఎస్సీలపై జరిగిన దమనకాండపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి న్యాయవిచారణ జరిపించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్రాధ్యక్షుడు గుడిసె దేవానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. నేషనల్ క్రైమ్‌రిపోర్ట్ ప్రకారం ఎస్సీలపై సుమారు 7 వేల దాడులు, హత్యలు, మానభంగాలు జరిగాయని, కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి చావుకు కారణమయ్యారని, ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు సీతానగరంలో దళిత యువకుడ్ని పోలీస్‌స్టేషన్‌లోనే శిరోముండనం చేయడం వంటివి చాలా జరిగాయని, వాటిల్లో బాధితులకు న్యాయం జరగాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు, ప్రధాన కార్యదర్శి పల్లి ధర్మేశ్ ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: స్థానిక ఆనం కళాకేంద్రంలో భట్రాజ సంఘ జిల్లా అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అత్యున్నత మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికలను పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బహూకరించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భట్రాజు కులంలో రామరాజ భూషణుడు, కాసుల పురుషోత్తమ కవి వంటి ప్రసిద్ధ కవులున్నారని, ఆదికవి నన్నయకు సహాధ్యాయుడైన నారాయణభట్టు, సినీగేయ రచయిత రసరాజు వరకూ ఎందరో మహనీయులు ఈ కులానికి చెందిన వారేనన్నారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ భట్రాజు కులంలో ఎస్ఆర్ భల్లం, రాళ్లబండి కవితా ప్రసాద్ వంటి ఎందరో ప్రముఖులన్నారన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు బీహెచ్ రమాదేవి, సీహెచ్ వెంకట రామరాజు, చిట్టి మన్ని వెంకటరాజు, శివరామకృష్ణ, సీతారామరాజు, ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధవళేశ్వరం, జూలై 7: చిన్నపాటి స్నేహితులు 22 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. 2001-22లో స్థానిక కాంతరాజు ఎయిడెడ్ పాఠశాలలో 7వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆ నాటి స్మృతులను నెమరవేసుకుంటూ స్నేహితుల కుటుంబ విషయాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ గడిపారు. అనారోగ్యం, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న స్నేహితులు, సహచరులను ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం

›› ఎమ్మార్పీఎస్ గోపాలపురం ఇన్‌చార్జి సురేష్‌కుమార్

దేవరపల్లి, జూలై 7: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవం సందర్భంగా దేవరపల్లిలో నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కేకు కట్ చేశారు. జెండాలు ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తాతాపూడి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కోడి సూరిమాదిగ, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, రాంబాబు, నందిగం బులిరాజు, కడిమి రాజు, జనసేన నాయకుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో పెట్టి చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణతో ఎస్సీ కులంలోని 59 ఉపకులాల వారికి సమాన న్యాయం జరుగుతుందన్నారు. పాలంగిలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేకూరి వీర్రాజు, జుత్తిగ కిశోర్‌బాబు తదిరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరం, చిలకపాడు, వేలివెన్ను, వెలగదుర్రు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేసినట్టు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమాల్లో బొల్లిపో సునీల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

పిరమిడ్ ధ్యాన జ్ఞాన మహాయజ్ఞం


తేజను సన్మానిస్తున్న జనసేన నాయకులు

పెరవలి, జూలై 7: సార్వత్రిక ఎన్నికల్లో తన తండ్రిని అధిక మెజార్టీతో గెలిపించిన వారందరికీ న్యాయం జరిగేలా సహకారం అందిస్తానని కందుల దుర్గేష్ తనయుడు తేజ అన్నారు. కానూరు అగ్రహారంలో జరిగిన శ్రీ బాబాజీ పిరమిడ్ ధ్యాన జ్ఞాన మహాయజ్ఞ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన విచ్చేశారు. గ్రామంలోని కార్యకర్తలందరూ కష్టపడి పని చేశారని గ్రామాభివృద్ధికి సహకరించే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను జనసేన నాయకులు దాసం మాణిక్యం, ప్రత్తిపాటి ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో దాసం సుబ్రహ్మణ్యం, పాలా వెంకటేష్, రంకిరెడ్డి ప్రసాద్, యింటి వెంకట్, పువ్వల సదాశివ గోపి, సీతయ్యనాయుడు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ జనసేనలో చేరిక


తిలక్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి

నల్లజర్ల, జూలై 7: మండలంలోని సింగరాజుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ గద్దె బాలగంగాధర్ తిలక్, వార్డు సభ్యులు జనసేన పార్టీలోకి చేరారు. ఆదివారం జనసేన గ్రామ అధ్యక్షుడు దొండపాటి బాబు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు.. సర్పంచ్ తిలక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విధానాలు నచ్చి పార్టీలోకి చేరే వారందరినీ ఆహ్వానిస్తామన్నారు. ప్రజలకు సేవ చేయాలని తలంచిన ప్రతిఒక్కరు జనసేనలోకి రావాలని ఆహ్వానించారు. సర్పంచ్‌తోపాటు దొండపాటి శ్రీను, అనపర్తి వెంకటస్వామి, మద్దాల శేషగిరి, దొండపాటి కేశవరావు, దొండపాటి నాగేశ్వరరావు, గద్దె సత్యనారాయణ, దాన రాజు, నాగరాజు, వెంకటేశ్వరరావు, శివ శంకరం పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, ప్రగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణను కుదించాలి

ఎంపీ పురందేశ్వరికి దొండపూడి గ్రామస్థుల వినతి


ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న దొండపూడి గ్రామస్థులు

గోపాలపురం, జూలై 7: జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు చేపట్టనున్న రహదారి విస్తరణను కుదించాలంటూ దొండపూడి గ్రామస్తులు జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు గెల్లా శ్రీను ఆదివారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి-కొవ్వూరు రహదారి విస్తరణకు గతంలో 18అడుగుల వెడల్పుతో సర్వే చేశారని, ఇటీవల 22 అడుగులకు పెంచి సర్వే చేస్తున్నారన్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా జీవనం సాగించే చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోతారన్నారు. గతంలో చేసిన సర్వే మాదిరిగా 18అడుగుల వెడల్పులతోనే రహదారి నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో మద్దాల కాశీవిశ్వనాథ సనారి, వెల్లంకి జయ శివసూర్యం, శ్రీను, పోలిన సురేష్, షేక్ హుస్సేన్, షేక్ వలి పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరం సర్వసభ్య సమావేశం

ఉండ్రాజవరం, జూలై 7: ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఉదయం 10గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో జేడీవీ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు దుర్గాప్రసాద్


దుర్గా ప్రసాద్‌ను ఆహ్వానిస్తున్న అర్చకులు

తాళ్లపూడి, జూలై 7: అర్చకుల సంక్షేమంతో పాటు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం తాళ్లపూడి శివాలయంలో వైకానసం, స్మార్తం, శైవం, పాంచరాత్రం, తంత్రసార, గ్రామ దేవత, ఆగమాల 8 మండలాల అర్చకుల సమస్యలపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేతనాలు పెంపు తదితర అంశాలపై చర్చించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర నాయకులతో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తానన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘ మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింలది. అధ్యక్షుడిగా కూచిభొట్ల ప్రసాద్, కార్యదర్శిగా చేబోలు రమేష్, కోశాధికారిగా కల్లూరి వీరరాఘవ శర్మ, ఉపాధ్యక్షుడిగా గుంటూరు బీవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా గోవర్ధనం మదనగోపాలాచార్యులు, ఎల్.సత్యనారాయణలను ఎన్నుకున్నట్టు గౌరవాధ్యక్షుడు మేడూరి గంగాధరశర్మ తెలిపారు. పెద్దింటి రంగబాబు, జంధ్యాల గంగాధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన రహదారులు


పైడిమెట్టలో కమ్యూనిటీ హాలు వద్ద నీట మునిగిన రోడ్డు

తాళ్ళపూడి, జూలై 7: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని వీధులు, రహదారులు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం నీరు చేరింది. పైడిమెట్ట ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు వద్ద నీరు నిలిచిపోయింది. అన్ని వీధులు వర్షం నీటితో మునిగి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను, నాయకులను కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై సోషల్ మీడియాలో ప్రచారం

నల్లజర్ల, జూలై 7: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నల్లజర్ల వైద్య సిబ్బంది వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్ చూస్తున్నారని గమనించిన వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్ తమ సిబ్బందితో సీజనల్ వ్యాధుల లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వీడియో రూపంలో ప్రజలకు పోస్టులు పెట్టారు. మండల వ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో ఆరోగ్య సూత్రాలు చక్కర్లు కొడుతున్నాయి.

వైసీపీ కార్యకర్తపై కేసు నమోదు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, జూలై 7: మండలంలోని అనంతపల్లికి చెందిన టీడీపీ నాయకులు గురుమిల్లి వెంకట సూర్యనారాయణ, చింతా గణేశ్‌లపై శనివారం రాత్రి పెప్పర్ స్ప్రే చేసిన వైసీపీ కార్యకర్త యేర్నేని సన్యాసిరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. టీడీపీ నాయకులు ముందుగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.